నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
మంగళవారం | ఆగస్టు 06, 2024 | www.navatelangana.com

పెట్రోల్ పంపు ప్రారంభం

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని చింతగూడ పిఏసిఎస్ ఆధ్వర్యంలో తపాలాపూర్ ప్రధాన రహదారిపై ఏర్పాటు చేసిన పెట్రోల్ పంపును ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెట్రోల్ పంప్ రైతులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. చుట్టు పక్కల గ్రామాల రైతులు ఇక నుండి దూరం వెళ్లి పెట్రోల్, డీజిల్ తెచ్చుకునే బాధ తీరుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో చింతగూడ పిఏసిఎస్ చైర్మన్ నాసాని రాజన్న, వైస్ చైర్మన్ కమ్మల విజయ ధర్మ, డైరెక్టర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



7న జిల్లాకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క రాక

- పిప్రిలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఈ నెల 7వ తేదీన ఆదిలాబాద్ జిల్లాకు రానున్నారు. బజార్‌హత్నూర్ మండలం పిప్రి గ్రామానికి రానున్న ఆయన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. ఉదయం 10.30గంటలకు హైదరాబాదు నుంచి ప్రత్యేక హెలిక్యాప్టర్‌లో బయలుదేరి ఉదయం 11.30గంటలకు పిప్రికి చేరుకోనున్నారు. అధికారులు, అనధికారులతో సమావేశం కానున్నారు. ప్రతిపక్షంలో ఉన్న సమయంలో పిప్రి నుంచే రాష్ట్రవ్యాప్త పాదయాత్ర మొదలుపెట్టిన భట్టి విక్రమార్క తాజాగా ఉప ముఖ్యమంత్రి హోదాలో ఈ గ్రామంలోనే అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టాలని భావిస్తున్నారు. నెల రోజుల క్రితమే ఆయన జిల్లా పర్యటన ఖరారైనప్పటికీ.. అనివార్య కారణాలతో వాయిదాపడింది. తాజాగా బుధవారం ఆయన జిల్లా పర్యటనకు రానున్నట్లు అధికారవర్గాలు చెబుతున్నాయి.

వైద్యులు లేక..వైద్యం అందక..!

- రిమ్స్‌లో వైద్యులు, సిబ్బంది బదిలీతో చికిత్సలకు సుస్తీ
- ఇప్పటికే అనేక ఖాళీలతో సతమతమవుతున్న ఆసుపత్రి
- తాజాగా 8మంది వైద్యులు వెళ్లగా..వచ్చింది ఇద్దరు మాత్రమే
- 69మంది స్టాఫ్ నర్సులదీ ఇదే పరిస్థితి
- ఇక సూపర్ స్పెషాలిటీ పరిస్థితి మరింత అగమ్యగోచరం
- పాలకులు, ఉన్నతాధికారులు దృష్టిసారిస్తేనే మేలు

పేదలకు నిరంతరం వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం నెలకొల్పిన రిమ్స్ ఆసుపత్రి మరింత అవస్థల్లోకి నెట్టబడుతోంది. వైద్య కళాశాల ప్రారంభించిన నాటి నుంచి వైద్యులు, సిబ్బంది ఖాళీలతో సతమతమవుతున్న ఆసుపత్రి తాజాగా మరింత సంకట స్థితిని ఎదుర్కొంటోంది. ప్రభుత్వం తాజాగా చేపట్టిన బదిలీలతో 8మంది వైద్యులు వెళ్లిపోగా.. ఇక్కడకు వచ్చింది మాత్రం ఇద్దరు మాత్రమే కావడం గమనార్హం. వీరే కాకుండా పేదలకు స్వయంగా చికిత్సలు అందించడంతో పాటు తోటి నర్సులకు సలహాలు ఇచ్చే స్టాఫ్‌నర్సులు ఏకంగా పెద్ద సంఖ్యలో బదిలీపై ఇతర ప్రాంతాలకు వెళ్లిపోవడం మరింత సమస్యను తెచ్చిపెడుతోంది. రిమ్స్ ఆసుపత్రి ఏండ్లుగా ఈ సమస్యను ఎదుర్కోగా.. కొత్తగా మూడేండ్ల క్రితం ప్రారంభించిన సూపర్ స్పెషాలిటీలోనూ ఇంతకంటే మరింత దుర్భరమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఖాళీలతో సతమతమవుతున్న రిమ్స్ ఆసుపత్రిలో పేదలకు మెరుగైన వైద్యం అందని ద్రాక్షగానే మారుతోంది.



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి జిల్లాకు వైద్యపరంగా తలమానికంగా ఉన్న రిమ్స్ ఆసుపత్రి అనేక సమస్యలు ఎదుర్కొంటోంది. 2008లో ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటి వరకు వైద్యులు, సిబ్బంది ఖాళీలతో తీవ్రంగా సతమతమవుతోంది. వైద్యుల పోస్టులకు అనేక సార్లు నోటిఫికేషన్లు జారీ చేసినా పూర్తిస్థాయిలో నిండటం లేదు. ఆయా కీలకమైన విభాగాల్లో ఖాళీలు భర్తీ కావడం లేదు. ఇక్కడే రిమ్స్ వైద్య కళాశాల ఉన్నప్పటికీ మెరుగైన వైద్యం కోసం హైదరాబాదు, నాగ్‌పూర్, యావత్‌మాల్ వంటి ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఎన్ని సౌకర్యాలు కల్పించినా చికిత్సలు అందించే వైద్యులు లేకపోతే ఉపయోగం లేకుండా పోయింది. ప్రస్తుతం ఉన్న వారు చికిత్సలు అందిస్తున్నా.. ఇంకా ఖాళీలు వేధించడం వారికి సైతం భారంగా మారుతోంది. తాజాగా ప్రభుత్వం చేపట్టిన బదిలీలతో ఇక్కడ పనిచేస్తున్న మరింత మంది వైద్యులు ఇతర ప్రాంతాలకు వెళ్లిపోవడం మరింత సమస్య తెచ్చిపెడుతోంది. ఇక్కడ్నుంచి ఎనిమంది వైద్యులు వెళ్లిపోగా.. ఇక్కడకు మాత్రం కేవలం ఇద్దరు మాత్రమే వచ్చారు. వీరితో పాటు స్టాఫ్ నర్సులు ఏకంగా 69మంది ఇక్కడ్నుంచి బదిలీపై వెళ్లిపోగా.. రిమ్స్‌కు వచ్చింది మాత్రం 12మంది మాత్రమే కావడం గమనార్హం. ఇలా వైద్యులు, సిబ్బంది ఖాళీల కారణంగా పేదలకు మెరుగైన వైద్యం అందని ద్రాక్షగా మారుతోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

రిమ్స్‌లో ఖాళీల పరిస్థితి ఇది

రిమ్స్ ఆసుపత్రిలో ప్రొఫెసర్ల 21పోస్టులు మంజూరు ఉండగా కేవలం 15మంది మాత్రమే పనిచేస్తున్నారు. ఇంకా ఆరు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అసోసియేట్ ప్రొఫెసర్లు 21మంజూరు కాగా ఇందులోనూ 15మంది పనిచేస్తున్నారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు 41 మంజూరు కాగా 19మంది పనిచేస్తున్నారు. ఇందులో ఏకంగా 22 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇక తాజా బదిలీల్లో ముగ్గురు ప్రొఫెసర్లు ఇతర ప్రాంతాలకు వెళ్లిపోగా.. అసోసియేట్ ప్రొఫెసర్లు ఐదుగురు బదిలీపై వెళ్లారు. కానీ ఇక్కడకు మాత్రం ఒక్కరే అసోసియేట్ ప్రొఫెసర్ ఇక్కడకు వచ్చారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ ఒకరు బదిలీ కాగా.. మరొకరు ఇక్కడకు వచ్చారు. ఇక రిమ్స్‌లో 351 స్టాఫ్ నర్సు పోస్టులు మంజూరు కాగా ఇన్నాండ్లు 289మంది మాత్రమే పనిచేశారు. 62పోస్టులు ఖాళీగా ఉండగా.. తాజాగా బదిలీల్లో మరో 69మంది ఇక్కడ్నుంచి వెళ్లిపోయారు. కానీ ఇక్కడకు మాత్రం కేవలం 12మంది మాత్రమే వచ్చారు. సుమారు 120వరకు స్టాఫ్ నర్సు పోస్టులు ఖాళీలు ఏర్పడ్డాయి. ప్రొఫెసర్లు ఇక్కడ్నుంచి వెళ్లిపోవడంతో పీజీ విద్యార్థులకు బోధన కష్టాలను తెచ్చిపెడుతోంది. అకాడమిక్ తరగతులకు అవరోధాలు ఏర్పడుతున్నాయి.

సూపర్‌స్పెషాలిటీలో మరింత దైన్యం

పేద ప్రజలకు ఆధునిక వైద్యం అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో నిర్మించిన సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి మరింత దయనీయ పరిస్థితిని ఎదుర్కొంటోంది. రూ.150కోట్లలో కార్పొరేట్ స్థాయిలో ఆధునిక సౌకర్యాలు కల్పించినా.. చికిత్సలు అందించేందుకు ఆయా విభాగాల్లో ప్రత్యేక నిపుణులైన వైద్యులు లేకపోవడం తీవ్ర సమస్యగా మారుతోంది. ఈ ఆసుపత్రిలో 52పోస్టులు మంజూరు ఉండగా ప్రస్తుతం 9మంది మాత్రమే పనిచేస్తున్నారు. ఇంకా 43వైద్యుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ సమస్యపై జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు పలుమార్లు ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి ఫలితం ఉండటం లేదు. అరకొర వేతనాలు ఇవ్వడం కారణంగానే ఇక్కడ పనిచేసేందుకు ప్రత్యేక వైద్య నిపుణులు ఇష్టపడటం లేదని తెలుస్తోంది. దీర్ఘకాలంగా వేధిస్తున్న ఈ సమస్యపై కొత్త ప్రభుత్వమైన దృష్టిసారించాల్సిన అవసరం ఉంది. జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు ఈ సమస్యపై ప్రత్యేక దృష్టిసారించి వైద్యులు, సిబ్బంది నియామకం చేపట్టాల్సిన అవసరం ఉందని జిల్లావాసులు అభిప్రాయపడుతున్నారు.

వైద్యుల భర్తీ చేపడుతున్నాం :

జైసింగ్‌రాథోడ్, రిమ్స్ డైరెక్టర్



రిమ్స్ ఆసుపత్రిలో ప్రొఫెసర్లు, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకం కోసం మంగళవారం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నాం. అవసరమైన వాటిని భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటాం. స్టాఫ్ నర్సుల నియామకం విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాను.

ఎన్‌హెచ్‌పై ప్రజాభిప్రాయ సేకరణ



నవతెలంగాణ-లక్షెట్టిపేట

పట్టణంలోని ఎస్విఆర్ ఫంక్షన్ హాల్‌లో నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో సోమవారం ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. దీనికి అసిస్టెంట్ కలెక్టర్ మోతీలాల్, ఎన్విరాన్మెంట్ ఈఈ లక్ష్మణ్‌ప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ గ్రామ సభలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. నేషనల్ హైవే అథారిటీ అధికారులు, ఏజెన్సీలు రైతుల భూములను బలవంతంగా గుంజుకుంటున్నారని నియోజకవర్గంలోని మూడు మండలాలకు చెందిన ప్రజలు, రైతులు, నాయకులు వాపోయారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు, దళారుల కోసమే అలైన్మెంట్ మార్చారని, ప్రజలకు వ్యతిరేకంగా ప్రజాభిప్రాయ సేకరణ నడుస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఎల్లంపల్లి ప్రాజెక్టు ద్వారా నష్టపోయిన రైతులకు ఎటువంటి లాభం జరగలేదని, గతంలో తీసుకున్న మ్యాప్ ఆధారంగానే ఫోర్‌వే లైన్ చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రజలను తప్పుదోవ పట్టించి ప్రజాభిప్రాయ సేకరణ చేపడుతున్నారు. ఫోర్ లైన్ వద్దంటూ రైతులు డిమాండ్ చేశారు. సభా వేదిక ముందు కూర్చొని నిరసన తెలిపారు. దీంతో అధికారులు ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు.

తపాలాపూర్‌లో అంగన్వాడీ కేంద్రం ప్రారంభం



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని తపాలాపూర్‌లో ఐదు లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన అంగన్వాడీ నూతన భవనాన్ని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యా వైద్యానికి పెద్దపీట వేస్తుందన్నారు. చిన్నపిల్లలను అంగన్వాడి కేంద్రాలకు తరలించి అక్కడ ఇచ్చే నాణ్యమైన పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు. రానున్న రోజుల్లో అంగన్వాడి కేంద్రాలను మాడ్రన్ అంగన్వాడీ కేంద్రాలుగా మార్చి చిన్నారులకు కార్పొరేట్ స్థాయి చదువులు అందిస్తామన్నారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్దిదారులకు సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం వివిధ గ్రామాలకు నూతన అంగన్వాడి భవనాలకు నిధులు కేటాయించాలని, అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని అంగన్వాడీలు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శశికళ, డిప్యూటీ తహసీల్దార్ రామ్మోహన్‌రావు, సిడిపిఓ రేష్మ, సూపర్వైజర్ పద్మ, అంగన్వాడీ టీచర్, శ్రీవాణి, కాంగ్రెస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు, ముజాఫర్ అలీ ఖాన్, మేకల మాణిక్యం, నాయకులు మోహన్‌రెడ్డి, రాజశేఖర్, ఇసాక్, ఆకుల సత్యనారాయణ, దుర్గం అమృతరావు, చిందం చంద్రయ్య, కూకటికారి శ్రీనివాస్, దాముక కరుణాకర్ పాల్గొన్నారు.

తొలి ప్రయత్నంలోనే ఉద్యోగానికి ఎంపిక

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



పట్టణంలోని బ్రాహ్మణవాడ కాలనీకి చెందిన హరిదాస్ విద్యాసాగర్, సురిత దంపతుల కుమారుడు శివప్రసాద్ మొదటి ప్రయత్నంలోనే ఏఈఈ పోస్టుకు ఎంపికయ్యారు. ఇటీవల విడుదలైన టీఎస్పీఎస్సీ ఉద్యోగ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి మిషన్ భగీర డిపార్ట్మెంట్‌లో ఉద్యోగం సాధించాడు. ఉద్యోగం సాధించడం పట్ల తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులతో పాటు మిత్రులు, ఆయనకు అభినందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

చిత్రకళా శిక్షణ పోస్టర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-మంచిర్యాల

చిత్రకళలో లోయర్, హయ్యర్ పరీక్షలకు శిక్షణ ఇవ్వడంతో పాటు దూరవిద్య ద్వారా ఫైన్ ఆర్ట్స్‌లో డిప్లొమా కోర్స్‌ని అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశ్యంతో మంచిర్యాలలో చిప్పకుర్తి ఆర్ట్స్ అకాడమీ ప్రారంభించినట్లు ప్రముఖ చిత్రకారుడు చిప్పకుర్తి శ్రీనివాస్ తెలిపారు. సోమవారం పట్టణంలోని వివేకా వర్ధిని డిగ్రీ కళాశాలలో చిత్రకళా పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను ప్రముఖ చిత్రకారుడు, ఆర్ట్ డైరెక్టర్ ఏలూరి శేషబ్రహ్మం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ చిత్రాకళా రంగంలో ఎందరో జీవనం కొనసాగిస్తున్నప్పటికీ చిత్ర కళను వృత్తిగా ఎంచుకొని, నేర్చుకున్న విద్యను నలుగురికి పంచాలనే ఆలోచన శ్రీనివాస్‌కు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో భారతీయ కలకార్ సంఘ్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాగంటి మంజుల, తెలంగాణ రాష్ట్ర సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షులు తాళ్లపల్లి రాజేశ్వర్, జిల్లా సీనియర్ చిత్రకారులు కంకణాల సత్యనారాయణ, చిప్పకుర్తి సత్యనారాయణ, ఎర్రవెల్లి యాదగిరి, మాదరబోయిన మూర్తి, మైదం మల్లేష్, బొంకూరి రాజు, గనముక్కుల మల్లేష్, ధర్మపురి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఘనంగా కంది శ్రీనివాస్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలు

- 30 ఏండ్లు రాజకీయాల్లోనే ఉంటా : కేఎస్ఆర్
- మెగా రక్తదాన శిబిరం, 150 యూనిట్ల రక్తం సేకరణ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎవరెన్ని కుట్రలు పన్నినా తన సంకల్పాన్ని ఆపలేరని, మరో 30 ఏళ్ల పాటు రాజకీయాల్లోనే ఉంటానని, ఆదిలాబాద్ అభివృద్దే ఏకైక లక్ష్యంగా ముందుకు సాగుతానని కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి అన్నారు. పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో సోమవారం పెద్ద సంఖ్యలో హాజరైన కాంగ్రెస్ నాయకులు, అభిమానులు, పుర ప్రముఖులు, మిత్రులు, శ్రేయోభిలాషుల మధ్య తన పుట్టిన రోజును ఘనంగా జరుపుకున్నారు. తన సతీమణి కంది మౌనారెడ్డి, కూతురు అరికతో కలిసి భారీ కేక్ కట్ చేశారు. కార్యకర్తలు, అభిమానుల కోరిక మేరకు జన్మదిన వేడుకలు జరుపుకుంటున్నానని, హంగులు, ఆర్భాటాలు లేకుండా సాదాసీదాగా ఉండడమే తనకిష్టమని స్పష్టం చేశారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, పుర ప్రముఖులు కేక్ తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అంతకుముందు కేఎస్ఆర్ జన్మ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రజాసేవా భవన్‌లో సర్వమత ప్రార్థనలు జరిపారు. అనంతరం క్రేన్ సాయంతో భారీ గజమాలతో కేఎస్ఆర్‌ను సత్కరించారు.



అంతకు ముందు ఇంటి నుండి ఓపెన్ టాప్ జీపులో వచ్చిన కంది శ్రీనివాసరెడ్డితో పాటు భార్య, కూతురుకు డప్పు చప్పుళ్ల మధ్య ఆదివాసీ గుస్సాడీ కళాకారుల నృత్యాలతో ఘనంగా స్వాగతం పలికారు. మైనార్టీ నాయకులు అభిమానంతో లడ్డూలతో తులాభారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని పలు గ్రామాల నుండి ప్రజలు, కాంగ్రెస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మిత్రులు, శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



బర్త్ డే పురస్కరించుకొని సేవా కార్యక్రమాలు

కంది శ్రీనివాసరెడ్డి పుట్టిన రోజును పురస్కరించుకుని పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా తన క్యాంపు కార్యాలయంలో మెగా రక్త దాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 150 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. అనంతరం పట్టణంలోని న్యూహౌజింగ్ బోర్డ్ కాలనీలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని పేద విద్యార్థులకు తన సతీమణి కంది మౌనారెడ్డితో కలిసి స్కూల్ బ్యాగులు అందించారు. అనంతరం రణదివెనగర్‌లోని పాఠశాల విద్యార్థులకు ప్లేట్స్ పంపిణీ చేశారు. పిల్లలు చదువుపై శ్రద్ధ పెట్టి బాగా చదువుకోవాలని, ప్రయోజకులై తల్లిదండ్రులతో పాటు చదువు నేర్పిన గురువులకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నాయకులు లోక ప్రవీణ్‌రెడ్డి, కౌన్సిలర్లు బండారి సతీష్, కలాల శ్రీనివాస్, చందా నర్సింగ్, ఇమ్రాన్, డేరా కృష్ణారెడ్డి, ఎంఏ షకీల్, మహాకాల్ అజయ్, ఎల్చార్వార్ సురేందర్, ఇంతియాజ్, అన్నపూర్ణ, అశోక్, విఠల్, మానే శంకర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయాలి



నవతెలంగాణ-నిర్మల్

కాంగ్రెస్ ప్రభుత్వంఇచ్చిన వాగ్దానాలని అమలు చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దుర్గం నూతన్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను వెంటనే అమలు చేయాలని, ఇండ్లు, ఇండ్ల స్థలాలు లేనటువంటి పేదలను గుర్తించి వెంటనే ఇండ్ల నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. రేషన్‌కార్డు లేని ప్రతి ఒక్కరికీ వెంటనే అందించాలని, ప్రకటించిన విధంగా రూ.4000 పెన్షన్ వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. పోడు వ్యవసాయం చేసుకొని బతుకుతున్న గిరిజన, గిరిజనేతర పేదలకు పట్టాలివ్వాలని, గత ప్రభుత్వం అసైన్మెంట్ భూములలో హరితహారం, క్రీడా ప్రాంగణాల పేరిట గుంజుకున్న భూములను తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కలెక్టర్ ప్రజా సమస్యలపై స్పందించి పనిచేయాలని, పుస్పూర్ గ్రామానికి చెందిన రైతు మోతీరామ్ జాదవ్‌కిషన్ కలెక్టర్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా సమస్య పరిష్కరించకుండా నిర్లక్ష్యం వహించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం స్పందించి ప్రజా సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు డాకూర్ తిరుపతి, తొడసం శంభు, పల్లికొండ గంగామణి, బి.సుజాత, బి.లలిత, పట్టణ శాఖ కార్యదర్శులు సూర్యభాన్, కలీం, రాము, లక్ష్మణ్, రాజేందర్, సురేఖ, సుజాత, ఫహీమ్, బషీర్, షానవాజ్‌ఖాన్, గిరిజన సంఘం నాయకులు సోమేశ్, సూర్యభాను, బర్కుంట గంగారాం, సలీం, ఆకొండపేట గ్రామ మాజీ సర్పంచ్ దుర్గం పోశలింగం పాల్గొన్నారు.

పట్టాలున్నా అటవీ అధికారులు అడ్డుకుంటున్నారు..

వేమనపల్లి : గతంలో రెవెన్యూ అధికారులు పోడు భూములకు పట్టాలు ఇచ్చారని, కానీ అటవీ అధికారులు సాగు చేసుకోనివ్వకుండా అడ్డుకుంటున్నారని మండలంలోని గోధుంపేట శివారు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2005లో కాంగ్రెస్ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, కార్మిక, ఉపాధి శాఖ మంత్రి గడ్డం వినోద్‌కుమార్ చేతులు మీదుగా 80 ఎకరాల పోడు భూములకు 40 మంది రైతులకు పట్టాలు అందించారన్నారు. 2017 వరకు కాస్తు కట్టామని తెలిపారు. కానీ కొన్ని సంవత్సరాల నుండి పోడు భూములకు వెళ్లకుండా రైతులను అడ్డుకోవడంతో రైతులందరూ కలిసి కోర్టులో పిటిషన్ దాఖలు చేశామన్నారు. సాగు చేసుకునే భూమిలో విపరీతంగా చెట్లు పెరగడంతో వాటిని తొలగించి పత్తి విత్తనాలను వేసుకున్నామని తెలిపారు. ఈ భూములకు రుణమాఫీలు జరుగుతున్నాయని, రైతుబంధు కూడా పడుతోందని, కానీ ఫారెస్ట్ అధికారులు మాత్రం సాగు చేసుకోనివ్వడం లేదని ఆరోపించారు. దీనిపై ప్రభుత్వ అధికారులు, స్థానిక ఎమ్మెల్యే గడ్డం వినోద్‌కుమార్ స్పందించి న్యాయం చేయాలని కోరారు.



గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడు మృతి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. టూటౌన్ పోలీసుల వివరాల ప్రకారం..తిర్పెల్లి కాలనీకి చెందిన సంద విఠల్ రైల్వేస్టేషన్ సమీపంలో పాత జాతీయ రహదారి దాటుతుండగా ఆదివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ విఠల్‌ను స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో సోమవారం మృతి చెందాడు.

మృతదేహంతో పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన

ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గుర్తించడంలో పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మృతుడి కుటుంబీకులు ఆరోపించారు. నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ సోమవారం టూటౌన్ పోలీస్‌స్టేషన్ ఎదుట అంబులెన్స్‌లో మృతదేహంతో నిరసన తెలిపారు. దీంతో కాసేపు ఉద్రిక్తత నెలకొంది. సీఐ కరుణాకర్‌రావు వారిని సముదాయించే ప్రయత్నం చేసినప్పటికీ ఆందోళనకారులు వినలేదు. వాహనాన్ని గుర్తిస్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు.

ఎమ్మెల్యేను సన్మానించిన టీఏజీఎస్ నాయకులు

నవతెలంగాణ-ఇంద్రవెల్లి



ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌ను సోమవారం టీఏజీఎస్ జిల్లా అధ్యక్షులు ఊయిక విష్ణు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశంలో గిరిజనుల సమస్యలపైన ఎమ్మెల్యే గళం విప్పడం అభినందనీయమని అన్నారు. ఏజెన్సీ డీఎస్సీ నోటిఫికేషన్ నిర్వహించాలని పేర్కొనడంతో పాటు తదితర సమస్యలపై మాట్లాడటంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కే.శ్రీకాంత్, శ్రీనివాస్, కృష్ణ పాల్గొన్నారు.

ఇన్‌చార్జి ఎంపీడీఓకు సన్మానం

నవతెలంగాణ-బోథ్



ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఇన్‌చార్జీ ఎంపీడీఓ దామెర్ల జీవన్‌రెడ్డిని సోమవారం బీజేపీ, బీఆర్ఎస్ మండల నాయకులు అభినందనలు తెలిపి, శాలువా కప్పి సన్మానించారు. గ్రామపంచాయతీ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఎంపీడీఓ స్పందించి తమ పరిధిలోని సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలోని బీజేపీ మండలాధ్యక్షులు బోరే రవీందర్, నాయకులు పిడుగు అశోక్‌రెడ్డి, సుభాష్, సూర్య, లాడేవార్ తుకారాం, చామంతుల కృష్ణ, శ్రీధర్‌రెడ్డి, రమేష్, సురేష్, రూప్‌సింగ్, కిషన్ పాల్గొన్నారు.

తల్లి పాలే బిడ్డకు సంపూర్ణ ఆహారం

నవతెలంగాణ-లోకేశ్వరం

మండలంలోని అర్లి, గొడిసెర గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో తహసీల్దార్ మోతీరాం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిపాలే బిడ్డకు సంపూర్ణ ఆహారమని, గర్భిణులు మంచి ప్రోటీన్ ఆహారం తీసుకోవాలని తెలిపారు. అనంతరం విద్యార్థుల ఎత్తు, బరువును పరిశీలించారు. హాజరు పట్టికను పరిశీలించి, మెనూ ప్రకారంగా భోజనాలు అందించాలని, అంగన్‌వాడీ టీచర్లకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గంగాధర్, మాజీ ఎంపీటీసీ దత్తురాం, అంగన్‌వాడీ టీచర్ సురేఖ, కమల, దేవిక, ఏఎన్ఎం సునీత, ఆశా కార్యకర్త సాయమ్మ, ఐకేపీ అధ్యక్షురాలు కావ్య గ్రామస్తులు పాల్గొన్నారు.

కళాశాలలను తనిఖీ చేసిన డీఐఈఓ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గుడిహత్నూర్, నేరడిగొండ మండలాల్లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలను డీఐఈఓ రవీందర్ కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అడ్మిషన్ల ప్రక్రియను, రికార్డులను పరిశీలించారు. అనంతరం తరగతి గదులలో తిరుగుతూ విద్యార్థులకు బోధిస్తున్న తీరును పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అలాగే కళాశాలల ప్రిన్సిపాల్ పలు సమస్యలను డీఐఈఓ దృష్టికి తీసుకువచ్చారు. అంతకుముందు కళాశాల ఆవరణలో విద్యార్థులతో కలిసి మొక్కలను నాటారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, సిబ్బంది ఉన్నారు.

ఆదివాసీ దినోత్సవ కరపత్రాల ఆవిష్కరణ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలకు సంబంధించిన కరపత్రాలను మాజీ మంత్రి జోగు రామన్న ఆవిష్కరించారు. సోమవారం తుడుందెబ్బ ఆదివాసీ నాయకులు జోగు రామన్నను బీఆర్ఎస్ కార్యాలయంలో కలిశారు. అనంతరం జోగు రామన్నతో కలిసి కరపత్రాలను ఆవిష్కరింపజేశారు. ఈ సందర్భంగా జోగు రామన్న మాట్లాడుతూ ఈనెల9న నిర్వహించే ప్రపంచ ఆదివాసీ దినోత్సవ కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కుమురంభీం కాలనీ నుంచి న్యూహౌసింగ్ బోర్డ్ వరకు నిర్వహించే ర్యాలీని విజయవంతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గణేష్, వెట్టి మనోజ్, కుమ్ర రాజు రేణుక పాల్గొన్నారు.

దళిత మహిళను చితకబాధడాన్ని ఖండిస్తున్నాం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రంగారెడ్డి జిల్లాలోని షాద్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎస్సీ కాలనీలో నివాసముండే దళిత మహిళ దొంగతనం చేసిందనె నెపంతో పోలీసులు చిత్రహింసలు పెట్టి చితకబాధడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని. తెలంగాణ మాదిగ జేఏసీ జిల్లా అధ్యక్షులు మల్యాల మనోజ్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ విషయమై తెలంగాణ ఎస్సీ, ఎస్టీ కమిషన్ న్యాయమైన విచారణ జరిపి ఆరోపణలు ఎదుర్కొంటున్న పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తెలంగాణలోని దళితులకు రక్షణ కల్పించే విధంగా సీఎం రేవంత్‌రెడ్డి, ఐజీ స్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని కోరారు.

పీఆర్టీయూ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు

నవతెలంగాణ-నేరడిగొండ

పీఆర్టీయూ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మండలంలో చేపట్టారు. అందులో భాగంగా సోమవారం వాంకిడి జెడ్పీహెచ్ఎస్, కొర్టికల్ ఆశ్రమ పాఠశాల, యాపల్‌గూడ పాఠశాలలో సభ్యత్వం నమోదు చేసినట్టు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలకు ఉచిత విద్యుత్తు, స్కావెంజర్లను నియమిస్తూ, బడ్జెట్ రిలీజ్ చేయడం జరిగిందని, ఈ సందర్భంగా ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు ఆడే నూర్ సింగ్, ప్రధాన కార్యదర్శి నర్ర నవీన్, జిల్లా కార్యదర్శి విఠల్ పాల్గొన్నారు.

పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్స్ విడుదల చేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, రియంబర్స్‌మెంట్ విడుదల చేయాలని, ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు సిడం సాయికుమార్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సాయికుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం ప్రారంభించాలని అన్నారు. పెరిగిన ధరలకు అనుకూలంగా మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచాలని, వాటిని విడుదల చేయాలని అన్నారు. గురుకులాలకు, వసతి గృహాలకు సొంత భవనాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలని అన్నారు. విద్యార్థులందరికీ ఉచిత బస్ పాసుల సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధానకార్యదర్శి అశోక్, కుమ్ర అరుణ్, సురేష్, రవి పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

పేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీఠ వేస్తుందని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. సోమవారం మండలంలోని బుద్ధనగర్ కాలనీకి చెందిన శామీమ్ సూల్తానాకు రూ.60వేలు, అదే విధంగా మెండపల్లి గ్రామానికి చెందిన కే.చంద్రమణికి మంజూరైనా రూ.19వేల సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ పథకం ఆర్థికంగా ఎంతగానో లాభం చేకూరుస్తుందన్నారు. రోగి చికిత్సకు అయ్యే ఖర్చును ప్రభుత్వమే భరిస్తూ ఆ పెందింటి కుటుంబాలకు అండగా ఉంటుందని తెలిపారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. సబ్బండ వర్గాల అభివృద్ధే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

నవతెలంగాణ-భైంసా

ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పాటుపడతానని ప్రజా సమస్యల పరిష్కారమే తన ధ్యేయమని ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. సోమవారం భైంసా పట్టణంలోని ఎస్ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీలో భైంసా పట్టణ, మండలానికి చెందిన 78 మంది లబ్ధిదారులకు దాదాపు రూ.20లక్షల సీఎంఆర్ఎఫ్ నిధుల కింద మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. 8 నెలల కాలంలో ఒకేసారి 800 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి షాదీముబారక్ పథకం కింద చెక్కులను అందించడం జరిగిందన్నారు. అదేవిధంగా 400 మంది లబ్ధిదారులకు ప్రస్తుతం సీఎంఆర్ఎఫ్ కింద దాదాపు రూ.2 కోట్ల విలువగల చెక్కులను పంపిణీ చేస్తున్నామని అన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలియజేశారు. ప్రజలు తనకిచ్చిన అవకాశాన్ని సద్వినియోగం పరుచుకుంటానన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ రాజేష్‌బాబు, మున్సిపల్ మాజీ చైర్మెన్ బి.గంగాధర్, మాజీ ఎంపీపీ అబ్దుల్ రజాక్ నాయకులు సోలంకి భీమ్‌రావు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నారాయణరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు తాలోడ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

వరద బీభత్సాన్ని జాతీయ విపత్తుగా ప్రకటించాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్
- వయనాడ్ బాధితులకు విరాళాల సేకరణ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కేరళ రాష్ట్రంలోని వయనాడ్‌లో వర్షాల కారణంగా కొండ చర్యలు విరిగిపడి వందలాది మంది మరణించి, వేలాది మంది నిరాశ్రయులు అయినందున కేంద్రం వెంటనే జాతీయ విపత్తుగా ప్రకటించి వయనాడ్ ప్రజలను ఆదుకోవాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ డిమాండ్ చేశారు. సోమవారం పార్టీ ఆధ్వర్యంలో వరద బాధితులకు ప్రజలనుంచి విరాళాల సేకరణ కార్యక్రమాన్ని బస్టాండ్ వద్ద నిర్వహించారు. ఆయా షాపులల్లో, హోటళ్లలో తిరుగుతూ తదితరులను సంప్రదించి, విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ మాట్లాడుతూ వరద బీభత్సంతో వయనాడ్ అతలాకుతలం అయ్యిందని అన్నారు. పర్యాటక కేంద్రంగా ప్రఖ్యాతి గాంచిన వయనాడ్ ప్రస్తుతం ఇలాంటి స్థితిలో ఉండటం బాధాకరమని అన్నారు. సమయంలో కేరళకు అండగా నిలబడాల్సిన కేంద్ర ప్రభుత్వం బాధ్యత రహితంగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. వెంటనే జాతీయ విపత్తుగా ప్రకటించి వయనాడ్ ప్రజలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన విరాళాల ద్వారా రూ.8,800 సేకరించి పార్టీ రాష్ట్ర కమిటీ ద్వారా వరద బాధితులకు పంపించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు లంక రాఘవులు, అన్నమొల్ల కిరణ్, పూసం సచిన్, సీనియర్ నాయకులు బండి దత్త్రాత్రి, జిల్లా కమిటీ సభ్యులు ఆర్.మంజుల, నాయకులు అగ్గిమల్ల స్వామి, ధొనిపెల్లి స్వామి, ఎన్.స్వామి, పండుగ పొచ్చన్న, అన్నమొల్ల రూప, ప్రభుదాస్ పాల్గొన్నారు.

కార్మికులకు తంబ్ విధానాన్ని తీసేయాలి

- రాష్ట్ర కమిటీ సమావేశంలో బొజ్జ ఆశన్న



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

భవన నిర్మాణ కార్మికులకు లేబర్ కార్డు అప్లై చేయడానికి పెట్టిన తంబ్ విధానాన్ని తీసేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బొజ్జ ఆశన్న అన్నారు. సోమవారం హైదరాబాద్‌లో బిల్డింగ్ అదర్ కన్స్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ సీఐటీయూ రాష్ట్ర కమిటీ సమావేశం నిర్వహించారు. దీనికి బొజ్జ ఆశన్న హాజరై జిల్లా రిపోర్టు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆశన్న మాట్లాడుతూ భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికులకు హెల్పర్ బోర్డు కార్డు ఇవ్వడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. వెల్ఫేర్ బోర్డు కార్డు ఇవ్వడం తంబు విధానాన్ని తీసుకువచ్చారని అన్నారు. దాని వలన కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. తంబు విధానాన్ని తీసేయాలని డిమాండ్ చేశారు. ఆదిలాబాద్ జిల్లాలో అనేకమంది కార్మికులు వెల్ఫేర్ బోర్డు కార్డులు తీసుకున్నారని కానీ రెన్యువల్ చేసుకునే పనిలో వెనుకబడి ఉన్నారన్నారు. వెల్ఫేర్ బోర్డు కార్డును రెన్యువల్ చేసుకోవడం కోసం ఆఫీసుకు వెళ్తే చేయించడం లేదని చాలా ఇబ్బందులు పెడుతున్న పరిస్థితులు ఉన్నాయన్నారు. ఈ తంబు విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు నుంచి వచ్చే సంక్షేమ నిధులను కార్మికులకు ఎప్పటికప్పుడు పరిశీలన చేసి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

గిరిజనుల సమస్యలు పరిష్కారానికి కృషి : ఖుష్బూ గుప్తా



నవతెలంగాణ-ఉట్నూర్

గిరిజన ప్రజల సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు చేపట్టాలని, ఐటీడీఏ పీఓ ఖుష్బు గుప్తా అధికారులను ఆదేశించారు. సోమవారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యల అర్జీలను ఆమె స్వీకరించారు. ఉట్నూర్ మండలం పాత ఉట్నూర్ గ్రామానికి చెందిన గెడం శశిరేఖ తనకి ఏదైనా ఉద్యోగం కల్పించామని కోరారు. నార్నూర్ మండలం గంగాపూర్ గ్రామానికి చెందిన చౌహన్ బన్నీ తనకు పైచదువుల కొరకు ల్యాప్‌టాప్ ఇప్పించాలని విన్నవించారు. వాంకిడి మండలం లీంగూడ గ్రామానికి చెందిన ఆత్రం రాము తనకు ఇల్లు మంజూరు కొరకు చేయించాలని కోరారు. మామడ మండలం మామడ గ్రామానికి చెందిన లక్ష్మి తమ భూమికి పట్టా చేయించామని కోరారు. పింఛన్, డబుల్‌బెడ్ రూమ్ ఇండ్లు, స్వయం ఉపాధి పథకాల మంజూరు. వ్యవసాయ, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని ప్రజలు దరఖాస్తులు అందజేశారు. సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని పీఓ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈ ప్రజావాణిలో, ఏపీఓ వసంత్‌రావు, డీఎంజీసీ మేనేజర్ రామనందన్, అదనపు వైద్యాధికారి మనోహర్, పీఎచ్ఓ సందీప్ కుమార్, ఆర్‌సీఓ రాజ్యలక్ష్మి, ప్రిన్సిపాల్ మెస్రం మనోహర్, డీపీఓ ప్రవీణ్, మేనేజర్ లింగు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

శబరిమాత అఖండ జ్యోతి కార్యక్రమంలో ప్రముఖులు



నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని అర్లి గ్రామంలో 34 రోజులుగా అఖండ జ్యోతి కార్యక్రమాన్ని గ్రామస్తులు నెల రోజుల పాటు పెద్దఎత్తున నిర్వహించారు. కాగా సోమవారం ఈ కార్యక్రమానికి ప్రముఖులు ఎమ్మెల్యే అనిల్ జాదవ్, మాజీ మంత్రి జోగు రామన్న, డీసీసీబీ చైర్మెన్ అడ్డి బోజారెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జీ ఆడే గజేందర్, మాజీ జెడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి వేర్వేరుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పల్లకి యాత్రలో పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మాజీ మంత్రి జోగు రామన్న, ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ శబరిమాత అఖండ జ్యోతి కార్యక్రమం నిర్వహించడం ఆనందదాయకమని అన్నారు. గ్రామస్తులు కులమత బేధాలు లేకుండా అందరూ కలిసి కార్యక్రమాన్ని నిర్వహించడం ఐక్యతకు నిదర్శమని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల కన్వీనర్ తోట వెంకటేష్, నియోజకవర్గ అధికార ప్రతినిధి మొట్టె కిరణ్ కుమార్, బీఆర్ఎస్ నాయకులు కేదారేశ్వర్‌రెడ్డి, గజానంద్, రమేష్, అభిరామిరెడ్డి, సుదర్శన్ రెడ్డి, గంగన్న, లక్ష్మణ్, గ్రామస్తులు సురేందర్‌రెడ్డి, బోర్ల స్వామి, అదేవిధంగా కాంగ్రెస్ నాయకులు మాజీ ఎంపీపీ కళ్యాణం లక్ష్మిరాజేశ్వర్, మాజీ ఎంపీటీసీలు రమేష్‌రెడ్డి, వెంకన్న యాదవ్, పీఏసీఎస్ డైరెక్టర్ ప్రతాప్, ఆదివాసీ నాయకుడు కుమ్రం కోటేశ్, మెరుగు ప్రభాకర్‌రెడ్డి, ముడుపు మౌనిష్‌రెడ్డి పాల్గొన్నారు.

అప్పుడే పుట్టిన బిడ్డకు తల్లిపాలే శ్రేయస్కరం

- రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్
- ఆకట్టుకున్న నాటక ప్రదర్శన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అప్పుడే పుట్టిన బిడ్డకు తల్లిపాలే శేషయస్కరమని రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ అన్నారు. సోమవారం రిమ్స్‌లోని కంగారు మదర్స్ కేర్ యూనిట్ ఆధ్వర్యంలో తల్లిపాల ప్రముఖ్యతపై మేడికోలు ప్రదర్శన ద్వారా వివరించారు. తల్లులు పుట్టిన బిడ్డకు ముర్రిపాలు పట్టించాలనే అంశంతో చేసిన నాటకం ఆకట్టుకుంది. ఈ సందర్భంగా రిమ్స్ డైరెక్టర్ డాక్టర్ జైసింగ్ రాథోడ్ మాట్లాడుతూ బిడ్డకు తల్లిపాలు ఎంతో శ్రేయష్కరమని అన్నారు. ప్రస్తుతం ఉద్యోగం చేస్తున్న మహిళలు బిడ్డలకు పాలివ్వడానికి సుముకంగా ఉండటం లేదన్నారు. బిడ్డకు పాలిస్తే బిడ్డతో పాటు తల్లి కూడా ఆరోగ్యంగా ఉంటారన్నారు. బిడ్డకు రోగ నిరోధకశక్తి పెరుగుతుందన్నారు. దీనిపై తల్లులకు అవగాహన కల్పించేలా మేడికోలు చేసిన నాటకం బాగుందన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌సీయూ నోడల్ అధికారి డాక్టర్ అనంత్‌రావ్, పీడియాట్రిక్ వార్డు హెచ్‌ఓడీ డాక్టర్ హేమలత, వైద్యులు తిరుమల్‌రెడ్డి, సీనియర్ నర్సింగ్ ఆఫీసర్ విమలమ్మ, ఎలిజబెత్ రాణి పాల్గొన్నారు.

ఆదివాసీ దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

నవతెలంగాణ-సిరికొండ

ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని, తుడుందెబ్బ మండలాధ్యక్షుడు కుమ్ర యాదవ్‌రావ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. ఈ నెల 9న మండల కేంద్రంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని అన్నారు. మండలంలోని ఆయా గ్రామాల ఆదివాసులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఆయా ఆదివాసీ గ్రామాల నాయకులు అమృత్‌రావ్, రఘురాం, లస్మన్న, జంగు పాల్గొన్నారు.

ఆయూష్ ఆధ్వర్యంలో వృద్ధాప్య వైద్య శిబిరం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ భవనంలో ఆయూష్ ఆధ్వర్యంలో వృద్ధాప్య వైద్య శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. మెడికల్ ఆఫీసర్ ఫరీద బేగం, జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ ప్రితమ్ రాథోడ్‌లు వయోవృద్ధులను, పరీక్షించి మందులను ఉచితంగా అందించారు. వయోవృద్ధులు దీర్ఘకాలిక వ్యాధులైన బీపీ, షుగర్, మధుమేహం లాంటి వాటితో బాధ పడుతుంటారని అన్నారు. ఆయూష్ తరపున వైద్య శిబిరం నిర్వహించి, మందులను పంపిణీ చేశారు. పూర్తిగా హెర్బల్‌తో ఉంటాయని, ఈ మందుల వల్ల ఎలాంటి సైడ్‌ఎఫెక్ట్ ఉండదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆయూష్ సిబ్బంది దారతి, నవీన్ కుమార్, వయోవృద్ధులు పాల్గొన్నారు.

ఐటీడీఏ ఎదుట నిరుద్యోగుల ధర్నా

నవతెలంగాణ-ఉట్నూర్

ఐటీడీఏ పరిధిలో స్పెషల్ ఏజెన్సీ డీఎస్సీని వేయాలని ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు జాదవ్ సుమేష్ అన్నారు. సోమవారం ఐటీడీఏ కార్యాలయం ఎదుట నిరుద్యోగులు అందరూ కలిసి ధర్నా చేపట్టారు. అనంతరం పీఓ ఖుష్బు గుప్తాను కలిసి వినతపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గిరిజనుల కోసం ఏర్పాటు చేసిన ఐటీడీఏలో గిరిజనేతరులు రాజ్యం లేదన్నారు. ఐటీడీఏ పరిధిలో ఉన్న స్పెషల్ ఏజెన్సీ డీఎస్సీ నోటిఫికేషన్, బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని లేకుంటే ఐటీడీఏ ముట్టడి, హైదారాబాద్‌లో ధర్నాలు, రాస్తారోకోలు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో నిరుద్యోగులు ఉన్నారు.

న్యాయశాఖ కార్యదర్శిని కలిసిన ఏజీపీ

నవతెలంగాణ-బోథ్

హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో న్యాయశాఖ కార్యదర్శి తిరుపతిని సోమవారం బోథ్ జూనియర్ సివిల్ జడ్జీ కోర్టు ఏజీపీ పంద్రం శంకర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన కోర్టు భవన నిర్మాణానికి ఈ వారంలోనే భూమిపూజా కార్యక్రమం ఉంటుందని తెలిపారు. బోథ్ కోర్టు నూతన భవన నిర్మాణానికి అన్నివిధాలుగా సహకరించినందుకు న్యాయశాక కార్యదర్శికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

కొనసాగుతున్న డీసెట్ వెరిఫికేషన్ ప్రక్రియ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

డీఈఈ సెట్‌లో ర్యాంకులు సాధించిన ఉమ్మడి జిల్లా అభ్యర్థులకు ఆదిలాబాద్ డైట్ కళాశాలలో సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రక్రియ కొనసాగుతోంది. సోమవారం ర్యాంకుల ఆధారంగా ఆయా ప్రాంతాల నుంచి అభ్యర్థులు కేంద్రానికి రాగా సిబ్బంది సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేసి పలు సూచనలు చేశారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేసినట్టు డైట్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కిరణ్ కుమార్ తెలిపారు. సోమవారం 550 మంది అభ్యర్థులకు గాను, 479 మంది అభ్యర్థులు హాజరై తమ సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తి చేసుకున్నారని, 71 మంది హాజరుకాలేదని వివరించారు. మంగళవారంతో వెరిఫికేషన్ ప్రక్రియ ముగుస్తుందని తెలిపారు. ఇంకా వెరిఫికేషన్ చేసుకొని వారు ఎవరైనా ఉంటే సెంటర్‌కు వచ్చి చేసుకోవాలని సూచించారు.

పంచాయతీ కార్యదర్శికి ఘన సన్మానం

నవతెలంగాణ-ముధోల్

మండలంలోని అష్ట గ్రామపంచాయతి కార్యదర్శిగా గాడేకర్ గంగాధర్ ఇటీవల బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ యూత్ అధ్యక్షులు రావుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో కార్యదర్శికి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో శాశ్వత పంచాయతీ కార్యదర్శి లేనందువల్ల, ప్రత్యేక అధికారుల పాలనలో గ్రామంలో సమస్యలు తలెత్తాయని, వర్షాకాలంలో పారిశుధ్యం పనులు సకాలంలో చేపట్టాలని కోరారు. కార్యదర్శి గాడేకర్ గంగాధర్ మాట్లాడుతూ అందరి సహకారంతో గ్రామ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సుకన్య రమేష్, మాజీ ఎంపీటీసీ సునీతాపోశెట్టి, గ్రామస్తులు పాల్గొన్నారు.

7న వారసంత వేలం పాట

నవతెలంగాణ-లోకేశ్వరం

మండల కేంద్రంలో ఈనెల 7న (2024-25) సంవత్సరానికి ఆగస్టు నుంచి మార్చి వరకు వారసంత వేలం నిర్వహిస్తున్నామని ఆసక్తి గల సభ్యులు రూ.10వేల డిపాజిట్ చేసి, వేలంలో పాల్గొనాలని, పంచాయతీ కార్యదర్శి గంధం వినయ్‌సాయి తెలిపారు. మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

42శాతం రిజర్వేషన్‌లు అమలు చేసి ఎన్నికలు నిర్వహించాలి

నవతెలంగాణ-కుభీర్

బీసీలకు 42శాతం రిజర్వేషన్‌లు అమలు చేసి ఎన్నికలు నిర్వహించాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కన్వీనర్ సుంకేట పోశెట్టి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో బీసీ మండలాధ్యక్షుడు పుప్పాల పీరాజి అధ్యక్షతన బీసీ సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశనికి ముఖ్యఅతితిగా హాజరై మాట్లాడారు. ఈనెల 10న హైదరాబాద్ ఇందిరపార్క్ వద్ద నిర్వహించే బీసీల సత్యాగ్రహ దీక్షకు జిల్లాలోని బీసీ ప్రజలందరూ కలిసి అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కామారెడ్డి డిక్లరేషన్‌లో ఇచ్చిన మాటకు కట్టుబడి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేసిన తర్వాతనే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వే సమాచారాన్ని సేకరించాలని అన్నారు. లేని యెడల బీసీ సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాన్ని ఉద్రిక్తం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు బోడిగం సాయినాథ్, శ్రీకారం దత్త్రాతి, గజ్జరాం, నారాయణ పాల్గొన్నారు.

సీఐని కలిసిన ఉత్సవ కమిటీ సభ్యులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

వన్ టౌన్ పోలీస్ స్టేషన్ సీఐని సనాతన హిందూ ఉత్సవ కమిటీ సభ్యులు కలిశారు. ఇటీవల సీఐగా బాధ్యతలు స్వీకరించిన సునీల్ కుమార్‌ను సోమవారం కలిసి శాలువతో సత్కరించి, తమ సమితి ఆధ్వర్యంలో చేపట్టే కార్యక్రమాలను సీఐకి వివరించారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షులు ప్రమోద్ కుమార్ ఖత్రి, ప్రధాన కార్యదర్శి గెడం మాధవ్, ఉపాధ్యక్షుడు రేణికుంట్ల రవీందర్, తోట పరమేశ్వర్, పూసం ఆనంద్, అనిల్ పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
3
కుమురంభీం ఆసిఫాబాద్
మంగళవారం | 06 ఆగస్టు, 2024 | www.navatelangana.com

రుణమాఫీ కోసం పడిగాపులు

నవతెలంగాణ-బెజ్జూర్



మండల కేంద్రంలో ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార బ్యాంక్ ముందు రైతులు సోమవారం పడిగాపులు కాశారు. రుణం మంజూరైన సహకార సిబ్బంది అందుబాటులో లేకపోవడం వల్ల రైతులు రుణమాఫీ కోసం ఆందోళన చెందారు. ప్రభుత్వం మంజూరు చేసిన సిబ్బంది అందుబాటులో లేకపోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నానని మండల రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే రుణమాఫీ చెల్లించాలని డిమాండ్ చేశారు.

గిడ్డంగిలో మరమ్మతు పనులు చేయిస్తాం

నవతెలంగాణ-సిర్పూర్(టీ)



మండల కేంద్రంలో ఉన్న రైతులకు సంబంధించిన గిడ్డంగిలో ఉన్న మరమ్మతు పనులను పూర్తి చేపిస్తానని కాగజ్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ దేవయ్య అన్నారు. సోమవారం మండలంలోని గిడ్డంగిని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిడ్డంగి చుట్టూ ప్రహరీ గోడ లేదని, చిన్నచిన్న పనులను, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి దృష్టికి తీసుకువెళ్లి పనులు పూర్తి చేస్తాయిస్తామన్నారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ మెంబర్ సమీర్, శంకర్, సిర్పూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు చౌదరి తిరుపతి, మాజీ ఉపసర్పంచ్ మహేష్, పారిగా మాజీ సర్పంచ్ నానాజీ, ఇప్ప రవిశంకర్, దుర్గం రత్నాకర్ ఉన్నారు.

ఉద్యోగోన్నతితో మరింత బాధ్యత

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ఉద్యోగుల్లో ఉద్యోగోన్నతి మరింత బాధ్యతను పెంచుతుందని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారిని రమాదేవి అన్నారు. జిల్లాలోని వివిధ గిరిజన ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న ఐదు మంది ఉపాధ్యాయులకు ఉద్యోగన్నతి పొందగా వారిని సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉద్యోగోన్నతితో ఉద్యోగం పట్ల మరింత బాధ్యత పెరుగుతుందన్నారు. క్రమశిక్షణతో విధులు నిర్వర్తిస్తూ సర్వీస్‌లో మరిన్ని ఉద్యోగోన్నతులు పొందుతూ జిల్లాకు మంచి పేరు తీసుకురావడంతో పాటు వ్యక్తిగతంగా మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏసీఎంఓ ఉద్ధవ్, జీసీడీఓ శకుంతల, జిల్లా క్రీడల అధికారి మీనారెడ్డి పాల్గొన్నారు.

జోడేఘాట్‌లో పోరు గ్రామాల యువజన సంఘాల సమావేశం

నవతెలంగాణ-కెరమెరి



ఆదివాసుల అమర వీరుడు కుంరం భీం అసువులు బాసిన పోరుగడ్డ జోడేఘాట్‌లో సోమవారం పోరు గ్రామాల యువజన సంఘాల ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈనెల 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని జోడేఘాట్‌లో నివహించేందుకు నిర్ణయం తీసుకున్నారు. ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయ పద్ధతిలో కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పోరు గ్రామాల యువజన సంఘం కార్యనిర్వహణ అధ్యక్షుడు కుమ్రం కిరణ్ తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు టేకం పరుశురాం, గజానంద్, జంగాలు, సంతోష్, ధర్మ నాందేవ్, మారుతి, జలపతి, లక్ష్మన్ పాల్గొన్నారు.

చేవెళ్ల ఎస్సీ డిక్లరేషన్ అమలు చేయాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ ఇచ్చిన చేవెళ్ల ఎస్సీ డిక్లరేషన్ అమలు చేయాలని బీజేపీ నాయకుడు జయరాజ్ డిమాండ్ చేశారు. నాయకులతో కలిసి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేవెళ్లలో కాంగ్రెస్ ప్రవేశపెట్టిన డిక్లరేషన్‌కు బడ్జెట్లో నిధులు కేటాయించకపోవడం దారుణమన్నారు. అంబేద్కర్ అభయ హస్తం, మాదిగ కార్పొరేషన్‌కు నిధుల మంజూరు, ఎస్సీ కుటుంబానికి శాశ్వత ఇంటి నిర్మాణం, ఎస్సీ హాస్టల్స్ పునర్నిర్మాణం, ఎస్సీ కార్పొరేషన్ ద్వారా యువతకు సబ్సిడీ రుణాలు మంజూరు చేస్తామని ఇచ్చిన హామీలు నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో నాయకులు పవన్, గంగారాం, చిట్యాల వినోద్, ఇసాక్, సాయి పాల్గొన్నారు.

శ్రావణ మాస పూజలు ప్రారంభం

నవతెలంగాణ-బెజ్జూర్

మండల కేంద్రంలోని శివాలయంలో శ్రావణ మాస పూజలు సోమవారం ప్రారంభమయ్యాయి. బెజ్జూరు గ్రామానికి చెందిన పలువురు భక్తులు శివాలయంలో అభిషేకం నిర్వహించారు. మండల కేంద్రంలోని మండల కేంద్రంలోని రంగనాయక ఆలయ ప్రాంగణంలోని రంగనాయక, శివాలయం, వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయాల్లో శ్రావణ మాస సందర్భంగా భక్తులతో కిటకిటలాడింది.

సమస్యల వలయంలో పర్సువాడ



కుమురం భీం-ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలంలోని పర్సువాడ గ్రామం



పర్సువాడ వెళ్లాలంటే ఈ గుట్ట దాటాల్సిందే

గ్రామాలే దేశానికి పట్టుకొమ్మలని ప్రగల్భాలు పలుకుతున్న పాలకులు గ్రామాలను అభివృద్ధి చేయడంలో నిర్లక్ష్యంగా వహిస్తున్నారని చెప్పడానికి మండలంలోని పర్సువాడ గ్రామమే నిదర్శనం. సాంకేతిక పరిజ్ఞానం రోజు విశ్వాంతరాలకు దూసుకుపోతున్న మారుమూల గ్రామాల్లో కనీస సౌకర్యాలు లేక గిరిజనులు అభివృద్ధికి నోచుకోవడం లేదు. ఎన్నికల సమయంలో మారుమూల గ్రామాలను వెతుక్కుంటూ వెళ్లి ఓట్లు అడిగే నాయకులకు అధికారం వచ్చాక ఆ గ్రామాల వైపు కన్నెత్తి చూడడం లేదు. దేశానికి స్వాతంత్రం వచ్చి 75 ఏండ్లు గడుస్తున్నా మారుమూల గ్రామాల పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా దాపురించింది. ప్రభుత్వాలు మారిన పాలకులు మారిన గ్రామానికి సరైన రోడ్డు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్న పరసువాడ గ్రామం పై ప్రత్యేక కథనం

నవతెలంగాణ-కెరమెరి

మండలంలోని కెలి(బి) పంచాయతీ పరిధిలోని పర్సువాడ గ్రామానికి సరైన రోడ్డు సౌకర్యం, మౌలిక సదుపాయాలు కరువయ్యాయి. మండల కేంద్రం నుండి సుమారు 11 కిమీ దూరంలో ఉన్న ఈ గ్రామానికి 7 కిమీ దూరం కెలి(బి) గ్రామం వరకు తారు రోడ్డు సౌకర్యం ఉంది. అసలు సమస్య ఇక్కడే నుండే మొదలవుతుంది. కెలి(బి) నుండి 4కిమి దూరంలో ఉన్న పర్సువాడ గ్రామస్తులకు రాకపోకలు కొనసాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



బండరాళ్ల మధ్య నడక

కెలి(బి) గ్రామంలో నుండి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న పర్సువాడకు వెళ్లాలంటే బండరాళ్ల మధ్య నడక కొనసాగాల్సిందే. మూడు ఎత్తైన గుట్టలు...దారి పొడవునా పెద్దపెద్ద రాళ్లు.. రంపల మధ్య నడక నరకప్రాయంగా మారుతుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామం ఏర్పడి 45 ఏండ్లు దాటింది. 35 కుటుంబాలు 155 మంది జనాభా నివసిస్తున్న ఈ గ్రామంలో లంబాడి గిరిజన తెగు చెందిన ప్రజలు నివసిస్తున్నారు. ఈ గ్రామ సమీపంలోనే ఆదిమ గిరిజన తెగలకు చెందిన కొన్ని కుటుంబాలు సైతం నివసం ఉంటున్నాయి. గ్రామంలో నేటికీ చేతి పంపు కూడా లేదంటే గ్రామం ఏ విధంగా అభివృద్ధి చెందిందో అర్థం చేసుకోవచ్చు. 45 ఏండ్ల క్రితం గ్రామస్తులే నిర్మించుకున్న పురాతన బావి, మిషన్ భగీరథ నీళ్లపై ఆధారపడుతున్నారు. 20 రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా మిషన్ భగీరథ నీళ్ల సరఫరా కాకపోవడంతో బావినీటినే గ్రామస్తులు వినియోగిస్తున్నారు.

రోడ్డు సౌకర్యం లేక అభివృద్ధికి అటంకం

కెలి(బి) గ్రామము నుండి ఎత్తైన గుట్టల వరకు రెవెన్యూ పరిధిలో భాగం కాగా గుట్టలు మొదలు పర్సువాడ గ్రామం వరకు అటవీ శాఖ పరిధిలో ఉండడంతో రోడ్డు నిర్మాణం చేపట్టలేని పరిస్థితి. దీంతో గ్రామంలో ఎలాంటి అభివృద్ధి పనులకు అడ్డంకిగా మారింది. గ్రామంలో నేటికి పాఠశాల భవనం. అంగన్‌వాడీ కేంద్రం లేదు. పాఠశాల తాత్కాలికంగా ఏర్పాటు చేసిన షెడ్‌లో కొనసాగుతుండగా, అంగన్‌వాడీ కేంద్రం ఓ ఇంట్లో కొనసాగుతుంది. డ్రైనేజీ వ్యవస్థ లేక మురుగునీరు ఇలా మధ్య పారుతుంది. గ్రామంలో సీసీ రోడ్లు లేవు, వర్షాలకు గ్రామమంతా బురద మయంగా మారి అడుగు బయట వేయలేని విధంగా ఉంటుంది. గ్రామస్తులకు పక్కా ఇళ్ల లేకపోగా, నేటికి కర్రతో నిర్మించుకున్న ఇళ్లలో నివాసముంటున్నారు. పాలకులు దృష్టి సారించి రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. రోడ్డు సౌకర్యం ఏర్పడితే పర్సువాడ గ్రామం అన్నివిధాలా అభివృద్ధి చెందుతుందని గ్రామస్తులు చెబుతున్నారు.



ఈ చిత్రంలో కనిపిస్తున్న వృద్ధురాలు కొడప జంగుబాయి. పర్సువాడ సమీపంలోని కోలాం గూడలో నివాసం ఉంటుంది. ఆదివారం మండల కేంద్రంలోని సంతకు గుట్టలు దిగి బయలు దేరింది. కూరగాయలు, నిత్యావసర సరుకులు కొనుగులు చేసి తిరుగు ప్రయాణం అయింది. నిత్యావసర సంచిని మోసుకుంటు బండ రాళ్ళ మధ్య ఇంటి దారి పట్టింది. వృద్ధురాలు కావడంతో ఎత్తైన గుట్టల నడవలేక మార్గ మధ్యలోనే ఉండాల్సి వచ్చింది. ఆ తర్వాత గ్రామస్తుల సహకారంతో ఇంటికి చేరింది. ఇలా ఎన్నో వ్యయప్రసాలు పడుతు అనేక మంది గ్రామస్తులు తమ ఇండ్లకు చేరుకుంటున్నారు.

రోడ్డు మంజూరు చేయాలి

పవర్ జలపతి, పర్సువాడ గ్రామస్తుడు



అత్యవసర సమయాల్లో ఇబ్బందులు పడుతున్నాం. వర్షకాలం గ్రామానికి ద్విచక్ర వాహనం సైతం రాలేని పరిస్థితి. అనారోగ్యంతో బాధపడుతున్న వారిని, గర్భిణులను ఆస్పత్రులకు తీసుకెళ్ళాలంటే అష్టకష్టాలు పడుతున్నాం. రోడ్డు లేక గ్రామంలో మౌలిక సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం రోడ్డు మంజూరు చేయాలి.

ఎవరూ పట్టించుకోవడం లేదు

కొడప జంగుబాయి(కొలాంగూడ) పర్సువాడ



రేషన్ సరుకులు, ఫించన్ కోసం గుట్టలు దిగి రావాల్సిందే. గుట్టలు దిగి, తిరిగి గ్రామానికి వెళ్ళడానికి చాలా కష్టంగా ఉంది. గతంలో మా ఊరి పెద్దలు రోడ్డు సమస్యపై పలు మార్లు పాలకుల దృష్టికి తీసుకెళ్లారు. అయినా ఫలితం లేదు. ఎవరు పట్టించుకోవడం లేదు. నిత్యావసర సరుకులు తలపై మోసుకుంటు రాళ్లు, రంప ల మధ్య నడక నరక ప్రాయంగా ఉంది.

స్వచ్ఛదనం-పచ్చదనం నిరంతర ప్రక్రియ

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్

పచ్చదనం పెంచే ఉద్దేశంతో ప్రభుత్వం తీసుకువచ్చిన స్వచ్ఛధనం పచ్చదనం అనేది నిరంతర ప్రక్రియని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. ఆసిఫాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ఆర్‌ఆర్ కాలనీలో మున్సిపల్ కమిషనర్ భుజంగరావు అధ్యక్షతన నిర్వహించిన స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమానికి జిల్లా అటవీశాఖ అధికారి నీరజ్ కుమార్ టిబ్రేవాల్‌తో కలిసి హాజరై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటడం బాధ్యతగా తీసుకోవాలన్నారు. స్వచ్ఛధనం పచ్చదనం అనేది నిరంతర ప్రక్రియ అని తెలిపారు. ఐదు రోజులపాటు కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. దీనిలో భాగంగా గ్రామసభలు ఏర్పాటు చేసి స్థలం ఉన్న ప్రతి చోట మొక్కలు నాటేలా చూడాలన్నారు. అధికారులు తాజా మాజీ ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేసుకొని ముందుకు సాగాలన్నారు.

అడ గ్రామంలో..

స్వచ్ఛధనం పచ్చదనం కార్యక్రమంలో భాగంగా అడ గ్రామపంచాయతీ అధికారులు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డీపీఓ బిక్షపతి, డీఆర్డీఓ, ఎంపీడీఓ శ్రీనివాస్‌తో పాటు గ్రామస్తులతో కలిసి మొక్కలు నాటారు. మొక్కల నాటడంపై గ్రామస్తులకు అవగాహనకు వారిని అభినందించారు. ఇదే స్ఫూర్తిని భవిష్యత్తులో కొనసాగించాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్ : ప్రతి ఒక్కరు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తహసీల్దార్ వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం మండలంలోని ఎలుకపెల్లి, ఎల్లూరు గ్రామ పంచాయతీలో స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమంలో భాగంగా పాఠశాల విద్యార్థులతో కలిసి ఎంపీడీఓ ఆల్బర్ట్ ఆధ్వర్యంలో గ్రామంలో ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. మండల కేంద్రంలోని ప్రయాణ ప్రాంగణం వద్ద శ్రమదానం కార్యక్రమం నిర్వహించినంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద మొక్కలు నాటారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, చంద్రయ్య, ప్రధానోపాధ్యాయురాలు విజయ నిర్మల, ఆర్ఐలు గోపాల్, సురేష్, ఏపీఓ సతీష్, ఆషా, అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

సిర్పూర్(టి) : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛదనం పచ్చదనం ప్రతి ఒక్కరూ భాగస్వాములై విజయవంతం చేయాలని మండల స్పెషల్ ఆఫీసర్ ప్రభాకర్ అన్నారు. సోమవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా గ్రామపంచాయతీ కార్యాలయం నుండి వెంకటేశ్వర ఆలయం వరకు వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పి.సత్యనారాయణ, ఏపీఎం దుర్గయ్య, పంచాయతీ సెక్రెటరీ తిరుపతి, అంగన్‌వాడీ, ఐకేపీ, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

కెరమెరి : మొక్కలతోనే మానవ మనుగడ సాధ్యమని జెడ్పీ సీఈఓ, మండల ప్రత్యేక అధికారి లక్ష్మీనారాయణ అన్నారు. సోమవారం మండలంలోని కొఠారి, రింఘన్ ఘాట్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో పాల్గొన్నారు. పాఠశాలను సందర్శించి విద్యాబోధన తీరును అడిగి తెలుసుకున్నారు. రింఘన్ ఘాట్‌లో వ్యర్థాల ద్వారా ఎరువుల తయారీ గురించి గ్రామస్తులకు సూచనలు చేశారు. అంతకు ముందు గ్రామంలో విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం కొఠారి, రంగంఘాట్ గ్రామస్తులకు మొక్కలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అంజాద్ పాషా, నోడల్ అధికారి ఆడే ప్రకాష్, ఏపీఓ మల్లయ్య, కొఠారి గ్రామ పంచాయతీ అధికారి సతీష్ రావు, మాజీ సర్పంచ్ గుణ వంత్ రావు పాల్గొన్నారు.

బెజ్జూర్ : మండల కేంద్రంలోని సోమవారం స్వచ్ఛతనం పచ్చదనం అవగాహన ర్యాలీ నిర్వహించారు. మండల కేంద్రంలో ప్రధాన రహదారికి ఇరువైపులా మట్టిని తొలగించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గౌరీ శంకర్, ప్రత్యేక అధికారి వెంకటేశం, కార్యదర్శి తుకారం, విద్యార్థులు పాల్గొన్నారు.

చింతలమానేపల్లి : మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామపంచాయతీలలో స్వచ్ఛదనం-పచ్చదనంపై ర్యాలీలు నిర్వహించి, పరిశుభ్రత, పచ్చదనాన్ని పెంపొందించడానికి స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని సోమవారం మండల వ్యాప్తంగా ప్రారంభించారు. మండలంలోని రవీంద్రనగర్-1 గ్రామపంచాయతీలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య, గ్రామ పంచాయతీ సిబ్బందితో కలిసి ఎంపీడీఓ కోట ప్రసాద్ శ్రమదానం నిర్వహించి మొక్కలు నాటారు. జిల్లా పరిషత్ పాఠశాలలో స్వచ్ఛదనం-పచ్చదనంపై వ్యాస రచన పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. కార్యక్రమంలో ఏపీఓ గోవర్ధన్ సింగ్, పంచాయతీ సెక్రెటరీలు ఆసిఫ్ అలీ, విఘ్నేష్, విజయ్, మధుకర్, ఈసీ అనిల్ పాల్గొన్నారు.

తిర్యాణి : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని స్పెషల్ ఆఫీసర్ రమాదేవి, ఎంపీడీఓ మల్లేష్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో పరిసరాల పరిశుభ్రతపై అవగాహణ కల్పించి, శ్రమదానం చేశారు. గ్రామ పంచాయతీల కార్యాలయాల్లో మొక్కలు నాటారు. అనంతరం పరిశుభ్రత, సచ్ఛతపై పాఠశాలల్లో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో కార్యదర్శులు పాల్గొన్నారు.



ఆసిఫాబాద్ : మొక్కలు నాటుతున్న కలెక్టర్ వెంకటేష్ ధోత్రే, అధికారులు

కౌటాల : స్వచ్ఛతను పాటిస్తు పచ్చదనం పెంచాలని ఎంపీడీఓ కోట ప్రసాద్ అన్నారు. సోమవారం స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో భాగంగా అవగాహన కల్పించేందుకు పాఠశాల, కళాశాల విద్యార్థులు, కళాశాల విద్యార్థులతో కలిసి మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించామన్నారు. అననంతరం మండల పరిషత్ కార్యాలయంలో శ్రమదానం నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, అధికారులు, విద్యార్థులు, జీపీ కార్మికులు పాల్గొన్నారు.

రెబ్బెన : పర్యావరణాన్ని సంరక్షించుకోవడం కోసం పచ్చదనాన్ని పెంపొందించాల్సిన అవసరముందని రెబ్బెన ఎంపీడీఓ శంకరమ్మ అన్నారు. మండలంలోని వంకులం గ్రామంలో స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో పారిశుద్ధ కార్మికులతో పిచ్చి మొక్కలు తొలగించి గ్రామంలో సానిటేషన్ చేయించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. పిల్లలకు పౌష్టికాహారంపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్స్, ఆయా, గ్రామస్తులు పాల్గొన్నారు.



రెబ్బెన



తిర్యాణి



చింతలమానేపల్లి



పెంచికల్‌పేట్

విద్యార్థులు భాగస్వాములు కావాలి

నవతెలంగాణ-నస్పూర్



పర్యావరణ సంరక్షణలో విద్యార్థులు భాగస్వాములు కావాలని రెయిన్ బో పాఠశాల కరస్పాండెంట్ అమౌంట్ ప్రసాద్ అన్నారు. సింప్లిసిటీ డేని పురస్కరించుకుని సోమవారం విద్యార్థులను శ్రీరాంపూర్‌లోని సింగరేణి నర్సరీకి తీసుకెళ్లారు. పర్యావరణ సంరక్షణలో భాగంగా విద్యార్థులు ఉల్లాసంగా తోట పనిని చేపట్టారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ అమన్ ప్రసాద్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులను భాగస్వాములను చేయడం ఎంతో అవసరమని, ఈ రోజుల్లో విద్యార్థులు ప్రకృతికి దూరంగా పుస్తకాలకే పరిమితమై ఉంటున్నారని, తోటపని చేయటం ద్వారా సహనం, బాద్యత, ప్రకృతిని ప్రేమించడమే కాకుండా శారీరక వ్యాయామం కూడా అలవడుతుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రజని, ప్రియాంక, ఉపాధ్యాయినులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాల పరిసరాల్లో మద్యం విక్రయిస్తే చర్యలు

నవతెలంగాణ-జైపూర్



మండల పరిధిలో ప్రభుత్వ పాఠశాలలకు సమీపంలో గల షాపుల యజమనులు మద్యం, మత్తు పదార్థాలు (పొగాకు ఉత్పత్తులు) అమ్మకాలు జరిపితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని భీమారం ఎస్సై రాములు హెచ్చరించారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల సమీపంలో గల కిరాణా షాపులను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన మద్యం, మత్తు పదార్థాలు విక్రయించరాదని సూచించారు. మండల పరిధిలో పాఠశాలల సమీప కిరాణ షాపుల యజమానులు సహకరించాలని కోరారు.

స్వచ్ఛదనం-పచ్చదనం విజయవంతం చేయాలి

- కలెక్టర్ కుమార్ దీపక్

నవతెలంగాణ-లక్షెట్టిపేట

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో ప్రజలను భాగస్వాములు చేసి విజయవంతం చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం మండలంలోని వెంకట్రావు పేటలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ కుమార్ దీపక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి స్వచ్ఛదనం-పచ్చదనంపై అవగాహన కలిగిస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రామపంచాయతీ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ స్వచ్ఛమైన పర్యావరణాన్ని యథావిధిగా ముందు తరాలకు అందించాలని, పచ్చదనం, పరిశుభ్రతతో గ్రామాలు విరాజిల్లినప్పుడే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఆరోగ్యవంతమైన గ్రామాలను తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. ప్రతి ఒక్కరూ ఇంటి వద్ద, పాఠశాలల చుట్టుపక్కల, పొలాల వద్ద, ఖాళీ స్థలాల్లో, రోడ్ల వెంట మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలని విద్యార్థులకు సూచించారు. మొక్కలు నాటడం వల్ల కాలుష్యం తగ్గడంతో పాటు వర్షాలు విరివిగా పడి పాడి పంటలతో అందరూ సుఖ సంతోషాలతో జీవిస్తారని ప్రకృతిని ప్రేమించడం, ప్రకృతితో కలిసి జీవించడం అలవాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.సరోజ, డీఎల్‌పీఓ ధర్మారాణి, స్పెషల్ ఆఫీసర్ స్వప్న, ఎంపీఓ శ్రీనివాస్, ఏపీఓ వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శి వంశీకృష్ణ, పాఠశాల ఇన్‌చార్జి శ్రీమన్నారాయణ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు నలిమెల సత్తయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు నలిమెల రాజు, మాజీ సర్పంచ్ సింహాద్రి, మాజీ వార్డ్ సభ్యులు బండి రాజలింగు, తోట శ్రీనివాస్, అశోక్, కుందారపు ప్రసాద్ పాల్గొన్నారు.



లక్షెట్టిపేట



జన్నారం

జన్నారం : మొక్కలు నాటి వాటిని సంరక్షించి పూర్తిస్థాయిలో వృక్షాలు చేసినప్పుడే మంచి ఫలితం ఉంటుందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. అనంతరం రైతు వేదికలో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు. పచ్చదనం పెరగాలంటే ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలన్నారు. స్వచ్ఛతనం కావాలంటే వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఇంటి పరిసరాలలో మురికి కాలువలు లేకుండా చూసుకోవాలన్నారు, ఈగలు దోమలు వాలకుండా జాగ్రత్తలు వహించాలన్నారు. కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ కిషన్, ఎంపీడీఓ శశికళ, ఇన్‌చార్జీ ఈఓపీఆర్డీ జలంధర్, కాంగ్రెస్ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ముసాఫర్ అలీ ఖాన్, మేకల మాణిక్యం, నాయకులు మోహన్ రెడ్డి, రాజశేఖర్, ఇసాక్, దాముఖ కరుణాకర్ మహ్మద్ రియాజుద్దీన్, ఫసియుల్లా, గంగన్న రాజన్న పాల్గొన్నారు.

జైపూర్ : కుటుబంలోని ప్రతి ఒక్కరు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం బాధ్యతగా భావించాలని జిల్లా పరిషత్ సీఈఓ, మండల ప్రత్యేకాధికారి గణపతి సూచించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమాన్ని సోమవారం ఇందారంలో ప్రారంభించారు. స్థానికులు, అంగన్‌వాడీ కార్యకర్తలు ఆశా కార్యకర్తలతో కలిసి ప్రభుత్వ పాఠశాల ఆవరణ, ఇతర ప్రదేశాలలో పిచ్చి మొక్కలు తొలగించి మొక్కలు నాటారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయం నుండి జిల్లా పరిషత్ పాఠశాల వరకు ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించిన ఆయన రోజు వారిగా స్వచ్ఛదనం..పచ్చదనం కార్యక్రమాలు కొనసాగించాలని తెలిపారు. ఇందులో ఎంపీఓ శ్రీపతి బాపు రావు, గ్రామ పంచాయతీ కార్యదర్శి సుమన్ పాల్గొన్నారు.

రామారావుపేటలో...

ప్రభుత్వం ప్రవేశపెట్టి సచ్ఛదనం..పచ్చదనం కార్యక్రమాన్ని సోమవారం తహసీల్దార్ వనజారెడ్డి రామారావుపేట్ గ్రామ పంచాయతీలో ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించిన తహసీల్దార్ వనజా రెడ్డి విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. స్థానిక ప్రజా ప్రతినిదులతో కలిసి పాఠశాల ఆవరణ, గ్రామ పంచాయతీ కార్యాలయం పరిసరాలను పరిశుభ్రం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, వార్డు సభ్యులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

తాండూర్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం పచ్చదనంలో భాగంగా సోమవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్, నర్సాపూర్‌లో స్పెషల్ ఆఫీసర్ ఆర్ఐ మురళీధరరావు సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో రోజు వారీగా చేయవలసిన అభివృద్ధి పనుల గురించి సమావేశంలో చర్చించారు. అధికారులు, స్థానిక నాయకులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ పంచాయతీ సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి దివాకర్, మహేందర్ రావు, బానయ్య, ఈసా, శంకర్, రహమత్‌ఖాన్, రాజేశం, ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు, ఐకేపీ సిబ్బంది, పాఠశాల విద్యార్థులు, గ్రామ పంచాయతీ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

మందమర్రి : మున్సిపాలిటీ పరిధిలో స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు ప్రారంభించారు. పురపాలక సంఘ కార్యాలయం నుండి పాత బస్టాండ్ మీదుగా రామన్ కాలనీ 20వ వార్డు నుండి 19వ వార్డు విద్యానగర్ మీదుగా మున్సిపల్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. పాత బస్టాండ్ చౌరస్తాలో స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో భాగంగా రోజువారీ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో డీఈ ఎం.సుమతి, ఇన్‌చార్జి మేనేజర్ పి.కృష్ణ ప్రసాద్, శానిటరీ ఇన్స్‌పెక్టర్ వి. శ్యాంసుందర్, సీనియర్ అసిస్టెంట్లు బి.శ్రీనివాస్, ఏ.రాణి, జి.రాజేందర్, డి.లక్ష్మి రాజు, హెల్త్ అసిస్టెంట్ ఎంఏ సమీర్, జూనియర్ అసిస్టెంట్లు ఎస్. రాజ్ కుమార్, బి.విమల రాణి, షేక్ జహీర్, ఇ.వసంత్ పాల్గొన్నారు.



జైపూర్



తాండూర్



మందమర్రి

ద్విచక్ర వాహనదారులను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

- నలుగురికి తీవ్ర గాయాలు



నవతెలంగాణ-మంచిర్యాల

మంచిర్యాల పట్టణంలో ఆర్టీసీ బస్ బీభత్సం సృష్టించింది. రోడ్డుపై వెళు తున్న వాహనదారులను వెనుక నుండి ఢీకోట్టింది. ఈ ఘటనలో నాలుగురికి తీవ్ర గాయాలు కాగా ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. సీఐ బన్సీలాల్ తెలిపిన వివరాల ప్రకారం.. టీఎస్19డీ0213 నంబర్ గల ఆర్టీసీ ప్రయివేట్ బస్ గోదావరిఖని నుండి మంచిర్యాల బస్ స్టాండ్‌లోకి వెళ్లే క్రమంలో మంచిర్యాలలోని వెంకటేశ్వర థియేటర్ చౌరస్తా వద్ద రోడ్డుపై వెళు తున్న రెండు ద్విచక్ర వాహనాలను ఢీకొట్టింది. ఈ ఘటనలో మంచిర్యాలకు చెందిన తండ్రి కూతుళ్ల రేగుంట రమేష్, రేగుంట దీపలతో పాటు భూపాలపల్లికి చెందిన బండి మహేష్, శ్రీరాంపూర్ చెందిన నవీన్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. అతివేగంతో వస్తున్న ఆర్టీసీ బస్ వాహనదారులను వెనుక నుండి ఢీకొట్టడంతో ప్రమాదం జరిగిందన్నారు. బస్ డ్రైవర్ గణపతిపై కేసు నమోదు చేసి బస్సును పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. ప్రమాదంలో గాయపడిన వారు మంచిర్యాల ప్రయివేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతుండగా దీప్తిని అత్యవసర చికిత్స నిమిత్తం కరీంనగర్‌కు తరలించారు. దీప్తి పరిస్థితి విషమంగా ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు
- ప్రెస్‌క్లబ్ అదనపు పనులకు భూమి పూజ



నవతెలంగాణ-జన్నారం

ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లో తీసుకెళ్లేల మీడియా బాధ్యతగా వ్యవహరించాలని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు. సోమవారం ప్రెస్‌క్లబ్ అదనపు పనులకు రూ. 4లక్షలు ఎమ్మెల్యే నిధులతో మంజూరు చేయించి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా మీడియా ఉంటుందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించడానికి మీడియా ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు చేలువేరు నరసయ్య, ప్రధాన కార్యదర్శి గాజుల లింగన్న, గౌరవ అధ్యక్షులు మందపల్లి కాంతయ్య, సీనియర్ పాత్రికేయులు వెంబడి మల్లేష్, జాడి వెంకటయ్య శేఖర్, కాంగ్రెస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు ముసాఫర్ అలీఖాన్, మేకల మాణిక్యం రాజశేఖర్, ఇషాక్, మోహన్ రెడ్డి, ముత్యం రాజన్న, మామిడిపల్లి ఇందయ్య, రమేష్, దాముక కరుణాకర్, ముజ్జు మహ్మద్ రియాజుద్దీన్ పాల్గొన్నారు.

టీచర్లను విధుల నుండి తొలగించాలి

నవతెలంగాణ-నస్పూర్

పాఠశాలల్లో బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్న మంచిర్యాల గురుకుల మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయురాలు పుష్పలత, అలాగే లక్షెటిపేట మహాత్మ జ్యోతిబాపూలే పాఠశాల ప్రిన్సిపాల్ కిరణ్, వైస్ ప్రిన్సిపాల్ సాగర్‌ను విధుల నుండి తొలగించాలని పీడీఎస్‌యూ, యూఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.శ్రీకాంత్, యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహయ కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి మాట్లాడుతూ మంచిర్యాల జిల్లాలో మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో ఉన్న ప్రిన్సిపాల్, అధ్యాపకురాలు విద్యార్థులతో పనులు చేయించుకుంటూ క్రమంలో శుక్రవారం పుష్పలత ఉపాధ్యాయులు తన లాప్టాప్‌ని చార్జింగ్ పెట్టమని డిగ్రీ సెకండ్ ఇయర్ చదువుతున్న వైష్ణవికి ఇచ్చారన్నారు. చార్జింగ్ పెట్టే క్రమంలో విద్యుత్ షాక్‌కు గురైందన్నారు. కాబట్టి తక్షణమే ప్రిన్సిపాల్, పుష్పలత ఉపాధ్యాలను విధులనుండి తొలగించాలన్నారు. విద్యార్థికి వైద్య ఖర్చులు ఇవ్వాలని తెలిపారు. అలాగే లక్షెట్టిపెట్ మహత్మ జ్యోతిబాపూలే బాలుర పాఠశాలలో ఇంటర్ సెకండియర్ చదువుతున్న శివకృష్ణ అనే విద్యార్థిని ప్రిన్సిపాల్ కిరణ్ కొట్టడం జరిగిందన్నారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించి విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని తెలిపినట్లు పేర్కొన్నారు.

ఇచ్చిన హామీలు అమలు చేయాలి



నవతెలంగాణ-జన్నారం

రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా జిల్లా అధ్యక్షుడు జాడి దేవరాజ్ అన్నారు. సోమవారం తహసీల్దార్ రాజ మనోహర్ రెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలల కాలం పూర్తయిన ఇచ్చిన హామీలను అమలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలు అమలు అయ్యేంతవరకు పోరాటాలకు సిద్ధపడాలన్నారు. సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఈనెల 9న కలెక్టరేట్ ఎదుట ప్రదర్శన ధర్నాను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు పురంశెట్టి బాపు, రమాదేవి, శంకర్, పోశవ్వ, రాజన్న పాల్గొన్నారు.

మార్గదర్శకాలకు అనుగుణంగా కొనసాగాలి

- మండల ప్రత్యేకాధికారి కల్పన



నవతెలంగాణ-జైపూర్

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం..పచ్చదనం మార్గదర్శకాలకు అనుగుణంగా కొనసాగాలని మండల ప్రత్యేక అధికారి, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి కల్పన సూచించారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ సత్యనారాయణతో కలిసి సోమవారం భీమారం మండల కేంద్రంలో విద్యార్థులతో కలిసి ప్రధాన వీధుల మీదుగా ర్యాలీ నిర్వహించారు. వ్యాధులు ప్రబల కుండా ఉండాలంటే గ్రామీణులు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. అదేవిధంగా నివాస ప్రాంతాల్లో విరివిరిగా చెట్లు నాటుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడి కార్యకర్తలు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలు అమ్మితే చర్యలు : ఎస్ఐ



నవతెలంగాణ-మందమర్రి

మత్తు పదార్థాలు, గంజాయి ఉత్పత్తులు, ప్రభుత్వ నిషేధిత వస్తువులు పాఠశాలకు వంద మీటర్ల సమీపంలో దుకాణం అమ్మితే చర్యలు తప్పవని ఎస్ఐ రాజశేఖర్ అన్నారు. సోమవారం దుకాణాలను సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. పాఠశాలలకు వంద మీటర్ల దూరంలో యజమానులు ఎట్టి పరిస్థితుల్లో మత్తు పదార్థాలు, గంజాయి, నిషేధిత వస్తువులు అమ్మ రాదని సూచించారు. అలా ఎవరైనా అమ్ముతున్నట్టు తెలిస్తే 100 డయల్ కు లేదా పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని వెంటనే తమ సిబ్బంది వచ్చి ఆ దుకాణం యజమానిపైన శాఖ పరమైన చర్యలు తీసుకుంటుందన్నారు.

తాండూర్ : మత్తు పదార్థాలు, గంజాయి, పొగాకు ఉత్పత్తులు, గుట్కా వంటివి నిషేధిత వస్తువులను అమ్మితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై కిరణ్ కుమార్ హెచ్చరించారు. సోమవారం పలు దుకాణాలను సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. దుకాణం యజమానులు మత్తు పదార్థాలు, గంజాయి, నిషేధిత వస్తువులు పొగాకు గుట్కా వంటి వాటిని అమ్మ రాదని సూచించారు. అలా ఎక్కడైనా అమ్ముతున్నట్టు సమాచారం ఉంటే డయల్ 100కు లేదా పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని సూచించారు.

పశుమిత్రలను వర్కర్లుగా గుర్తించాలి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్



నవతెలంగాణ-నస్పూర్

పశుమిత్రులను వర్కర్లుగా గుర్తించి కనీస వేతనం ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. పశు మిత్ర వర్కర్స్ యూనియన్(సీఐటీయు) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ప్రజావాణిలో యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీలత, నాగమణితో కలిసి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో వ్యవసాయ రంగం అత్యంత కీలకమైందని, వ్యవసాయానికి పాడి పరిశ్రమ ముఖ్యమైనదన్నారు. పాడి పరిశ్రమ బాగోగులు చూసే పశుమిత్రల పరిస్థితి అత్యంత దయనీయంగా ఉన్న ఈ తరుణంలో పశుమిత్రలను వర్కర్లుగా గుర్తించి కనీస వేతనం చెల్లించాలన్నారు. మహిళలు బడుగు బలహీన తరగతులని, పశుమిత్రలు పశుపోషకులకు పశు సంవర్ధక శాఖకు మధ్య వారధిలా పనిచేస్తూ పశువులకు వైద్య సేవలు, పశుపోషణపై అవగాహన కల్పిస్తూ పశువుల బీమా మొదలైన సేవలు అందిస్తున్నారన్నారు. దేశ ఉత్పత్తిలో రెండవ భాగంగా ఉన్న పశుసంపదను పరిరక్షిస్తున్న పశుమిత్రలకు ప్రభుత్వం ఎలాంటి వేతనం, పని భద్రత గాని కల్పించకపోవడం సరైనది కాదన్నారు. అడగకుండానే అన్ని సమస్యలు పరిష్కరిస్తానని ముఖ్యమంత్రి అనేకసార్లు చెప్పారని, 8 సంవత్సరాల నుండి వెట్టి చాకిరి చేస్తున్న ఈ సిబ్బంది సమస్యలను విస్మరించడం సరికాదని మండిపడ్డారు. కార్యక్రమంలో లావణ్య, స్వప్న, శారదా, సరోజ, జ్యోతి, స్వరూప, శ్రీలత, రజిత, రుక్మభాయ్ పాల్గొన్నారు.

లాభాల వాటా వెంటనే చెల్లించాలి

- సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య

నవతెలంగాణ-జైపూర్



సింగరేణి గని కార్మికులకు సంబంధించి సింగరేణి యాజమాన్యం సాధించిన లాభాలు ప్రకటించడంతో పాటు కార్మికులకు వెంటనే చెల్లించాలని సింగరేణి గుర్తింపు సంఘం (ఏఐటీయూసీ) రాష్ట్ర అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం ఇందారం-1ఏ గనిపై ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు జరిగి 7 నెలలు కావస్తుండగా యాజమాన్యం ఇప్పటి వరకు గుర్తింపు సంఘం పత్రం ఇవ్వకుండా జాప్యం చేస్తోందని ఆరోపించారు. ఫలితంగా కార్మికుల సమస్యలు పరిష్కరించబడకుండా పెండింగ్‌లో ఉంటున్నాయన్నారు. గుర్తింపు పత్రం ఇవ్వడం ద్వారా ఏరియా, కార్పోరేట్ లెవల్లో స్ట్రక్చర్ సమావేశాలు ఏర్పాటు చేయడం ద్వార కార్మికుల సమస్యలు పరిష్కారమయ్యే అవకాశం ఉండేదని తెలిపారు. ఇప్పటికైనా సింగరేణి యాజమాన్యం గుర్తింపు సంఘం పత్రం ఇవ్వాలని కోరిన ఆయన గతంలో పరిపాలన కొనసాగించిన ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా సింగరేణి భవిష్యత్తు ప్రశ్నార్థంగా మారిందని ఆరోపించారు. నూతన బావులు రాకపోగా పాత బావులు మూసివేస్తున్నందున సంస్థ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని, సింగరేణికి ఉజ్వల భవిష్యత్తు ఉండాలంటే నూతన బొగ్గు గనులు రావాలన్నారు. తెలంగాణ ప్రాంతంలోని బొగ్గు నిక్షేపాలను నామినేషన్ పద్ధతి ద్వారా సింగరేణి సంస్థకే కేటాయించడం ద్వారా సింగరేణికి భవిష్యతు ఉంటుందని, నూనత ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం అనుమతులిచ్చే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నాలు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిదంగా రాష్ట్ర ప్రభుత్వం నుండి సింగరేణి సంస్థకు రావాల్సిన రూ. 27 వేల కోట్లు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో శ్రీరాంపూర్ ఏరియా బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే బాజీ సైదా, బ్రాంచ్ కోశాధికారి నాగభూషణం, కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోచ్ ఖాన్, ఓసీ పిట్ కార్యదర్శి అగ్గు శ్రీకాంత్, సహాయ కార్యదర్శి ఆరిక రాజయ్య, ధరణి దేవేందర్, ఉపాధ్యక్షులు సత్తయ్య, దిద్ది రమేష్, ఇక్బాల్ హుసేన్, మధూకర్ పాల్గొన్నారు.

పుట్టినరోజు సందర్భంగా పుస్తకాలు పంపిణీ

నవతెలంగాణ-దహెగాం



మండలంలోని బీబ్రా గ్రామానికి చెందిన యువకుడు గోడిశెల మణికంఠ తన పుట్టినరోజు సందర్భంగా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలతో పాటు ఇంద్ర సేస్ ఫ్లే స్కూల్ ప్రయివేటు పాఠశాలలో విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సీలు చాక్లెట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో యువకులు రౌతు విగ్నేష్, రాము, సాయి, కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయునికి సన్మానం

నవతెలంగాణ-కౌటాల



ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయుడు రాకేష్ గుప్తాకు కౌటాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు నారాయణ సింగ్ ఆధ్వర్యంలో ఆత్మీయ సన్మానం చేశారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో బెజ్జూర్, సిర్పూర్, చింతలమానేపల్లి, కౌటాల మండల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మూడు ఉద్యోగాలకు ఎంపికైన రైతుబిడ్డ

నవతెలంగాణ-సిర్పూర్(టి)



టీజీపీఎస్సీ ప్రకటించిన మిషన్ భగీరథ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, పాలిటెక్నిక్ లెక్చరర్, టౌన్ ప్లాన్ బిల్డింగ్ ఆర్గనైజేషన్ ఉద్యోగ పరీక్షలో మండల కేంద్రానికి చెందిన కొత్తూరు నాగు బాయి నాగయ్య దంపతుల మొదటి కుమారుడు రాజ్ కుమార్ ఎంపికయ్యారు. మండలంలోని జడ్పీఎస్ పాఠశాలలో పదో తరగతి 2013లో చదువుకున్నాడు. అనంతరం బాసర ఐఐఐటి బీటెక్ సివిల్ ఇంజనీర్, వరంగల్ నీటిలో ఎంటెక్ పూర్తి చేశారు. 2021 సంవత్సరంలో చెన్నైలోని ఎల్ అండ్ టి ప్రైయివేట్ సంస్థలో ఉద్యోగం చేశాడు. 2023 సంవత్సరంలో కేంద్ర పర్యావరణ, అటవీ మరియు వాతావరణ ఆన్‌బ్లాక్ మంత్రిత్వ శాఖలో సైంటిస్ట్ బి ఉద్యోగం సాధించాడు. అంతటితో ఆగకుండా టీఎస్పీఎస్సీ ప్రకటించిన మిషన్ భగీరథ టౌన్ ప్లానింగ్ బిల్డింగ్ ఆర్గనైజేషన్ పాలిటెక్ లెక్చరర్ ఉద్యోగుల ప్రకటన చేసింది. 2023 మిషన్ భగీరథ మే నెలలో టౌన్ ప్లానింగ్ జూలై, సెప్టెంబర్‌లో పరీక్షలు రాశారు. ప్రస్తుతం టీజీపీఎస్సీ ప్రకటించిన ఫలితాలలో మూడు ఉద్యోగ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించారు. అలాగే గ్రూప్ వన్ మెయిన్స్ ప్రిపేర్ అవుతున్నాడు. ఇలా కేంద్ర మంత్రిత్వ శాఖలో ఉద్యోగం చేస్తూనే ఇతర ఉద్యోగాలకు పరీక్ష రాసి ఉత్తీర్ణత మిత్రులు బంధువులు శుభాకాంక్షలు తెలిపారు. చదువుకు పేద, ధనిక తేడా లేదని రాజకుమార్ నిరూపించారు. ఉన్నత చదువులు చదివిన యువతీయువకులు రాజకుమార్ ఆదర్శంగా తీసుకొని విజయం సాధించాలని కోరుతున్నారు.

వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలి



నవతెలంగాణ కెరమెరి

వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చి, ఉపాధి నిమిత్తం క్వారీలపై పూర్తి హక్కు కల్పించాలని ఎన్ఎస్‌యూఐ జిల్లా ప్రధాన కార్యదర్శి మాచర్ల మారుతి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి అజ్మీరా శ్యామ్ నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో వడ్డెర కుటుంబాలు 250 వరకు నివాసం ఉంటున్నాయన్నారు. వీరు ఆర్థికంగా, సామాజిక పరంగా, విద్య పరంగా ఎంతో వెనుకపడి ఉన్నారని తెలిపారు. ఉపాధి లేక స్వంత ఊర్లను వదిలి వలస వెళ్లి తమ ప్రాణాలను పోగొట్టు కుంటున్నారని అన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో వడ్డెర కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చుతామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. ఆ దిశగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పిట్ల గిడ్డప్ప, దండుగుల శ్రీనివాస్, సెల్లా దుర్గన్న, రజాక్, రాథోడ్ సుదర్శన్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, కుసుం రావు, సాజిద్, దేశముఖ్ పాల్గొన్నారు.

మట్కా ఆడుతున్న వ్యక్తి అరెస్ట్



నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ పట్టణంలో మట్కా ఆడుతున్న ఒకరిని సోమవారం అరెస్ట్ చేసినట్లు టౌన్ సీఐ శంకరయ్య తెలిపారు. పట్టణంలో ఆఫ్‌లైన్ మట్కా ఆడుతున్నట్లు అందిన సమాచారం మేరకు స్థానిక ఫ్లైఓవర్ కింద పోలీసులు తనిఖీలు నిర్వహించారు. పట్టణానికి చెందిన రాజేష్ బిస్వాస్‌ను తనిఖీ చేయగా అతని వద్ద మట్కాకు సంబంధించిన ఐదు చిట్టీలు, రూ. 2,100 లభ్యమయ్యాయి. అతనిపై కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

నవతెలంగాణ-పెంచికలపేట్



మండలంలోని కొండపెల్లి గ్రామంలో టాస్క్ ఫోర్స్ సీఐ రాణాప్రతాప్ ఆధ్వర్యంలో పీడీఎస్ బియ్యం అక్రమంగా తరలిస్తున్న సమాచారం మేరకు గ్రామంలో తనిఖీలు చేశారు. శ్రీనివాస్ గౌడ్ ఇంటిలో తనిఖీలు చేయగా ఐదు క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టుకుని మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్టు సీఐ రాణాప్రతాప్ తెలిపారు. ఆయన వెంట టాస్క్ ఫోర్స్ ఎస్ఐ వెంకటేష్, కానిస్టేబుళ్లు మధు, రమేష్ పాల్గొన్నారు.

స్వచ్ఛదనం-పచ్చదనం ర్యాలీ

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో సోమవారం స్వచ్ఛదనం-పచ్చదనం ర్యాలీ నిర్వహించారు. స్థానిక లారీ చౌరస్తా నుండి బస్టాండ్ వరకు నిర్వహించిన ఈ ర్యాలీలో ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబుతో పాటు అడిషనల్ కలెక్టర్ దీపక్ తివారి పాల్గొన్నారు. అనంతరం బస్టాండ్‌లో మొక్కలు నాటారు. నాటిన మొక్కలను సంరక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ సురేష్, మున్సిపల్ కమిషనర్ అంజయ్య, మున్సిపల్ చైర్మన్ షాహిన్ సుల్తానాతో పాటు పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.



వామ్మో పులి

- గోవిందపూర్‌లో అడుగుల గుర్తింపు
- అప్రమత్తంగా ఉండాలని సూచన

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఇప్పటి వరకు కాగజ్ నగర్ శివారులోని అంకుసాపూర్‌లో పులి సంచారం కొనసాగుతున్న నేపథ్యంలో తాజాగా సోమవారం సాయంత్రం జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న గోవిందపూర్ గ్రామ సమీపంలో పులి అడుగులు కనిపించడంతో అధికారులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న అధికారులు పులిగా గుర్తించారు.

అంకుసాపూర్ నుండి వచ్చిందా?

సోమవారం పులి మండలంలోని గుండి గ్రామం మీదుగా గోవిందపూర్ వరకు వచ్చినట్లు వాటి అడుగుల ద్వారా గుర్తించారు. అయితే కొంతకాలం నుండి అంకుసాపూర్ గ్రామ పరిధిలోని కెనాల్ ప్రాంతంలో నివాసం ఏర్పరచుకున్న పులి జిల్లా కేంద్రం వైపు వచ్చిందా లేదా కొత్త పులి జిల్లాకు వచ్చిందా..? అనే కోణంలో అధికారులు గుర్తింపు ప్రక్రియ ప్రారంభించారు.





గోవిందపూర్‌లో అడుగుల గుర్తింపు

మండలంలోని గోవిందపూర్ గ్రామ సమీపంలో పంట చేనులలో కొత్త అడుగులు కనిపించగా ఆసిఫాబాద్ మాజీ ఉపసర్పంచ్ గోవింద్ అటవీ అధికారులకు సమాచారం అందించారు. జిల్లా అటవీ శాఖ అధికారి నీరజ్ కుమార్, సీఐ సతీష్ స్పందించి డిప్యూటీ రేంజ్ అధికారి యోగేష్, ఏఎస్ఐ రాము, కానిస్టేబుల్ సందీప్ అక్కడికి చేరుకొని అడుగులు గుర్తించి పులివిగా నిర్ధారించారు.

అప్రమత్తంగా ఉండాలని సూచన

పులి సంచరిస్తున్నట్లు అధికారులు గుర్తించడంతో డిప్యూటీ రేంజ్ అధికారి మాట్లాడుతూ గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. రాత్రిపూట ఒంటరిగా తిరగకూడదని సూచించారు. సాధారణంగా పులి రాత్రి నుండి ఉదయం 6 గంటల వరకు తిరుగుతుందని ఆ సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎక్కడైనా పులి కనిపిస్తే వెంటనే తమకు సమాచారం అందించాలని సూచించారు. పులి ఎటువైపు వెళ్లిందనేది గుర్తించనున్నట్లు వివరించారు.

రోడ్డు ఇలా..నడక సాగేదెలా..?

నవతెలంగాణ-తిర్యాణి



బురదమయంగా మారిన రోడ్డు

స్వాతంత్రం సిద్ధించి 77 సంవత్సరాలు గడుస్తున్నా నేటికి మండలంలో సరైన రవాణా సౌకర్యం లేదు. గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం పల్లెల్లోనే ఉండాలని గొప్పగొప్ప నేతలు కలలు కన్నప్పటికీ అవి కలలుగానే నిలిచిపోయాయి. కంప్యూటర్ యుగంలో మనిషి పోటీపడి మేధాశక్తిని పెంపొంది అంతరిక్షంలో అడుగుపెడుతున్న ఈ రోజుల్లో రవాణ సౌకర్యం లేక మండల వాసులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాలకులు, అధికారులు రవాణ సౌకర్యంపై శ్రద్ధ చూపకపోవడంతో మారుమూల ప్రాంతాల్లో రహదారులు అధ్వానంగా మారాయి. మండలంలోని చింతపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని స్మశాన వాటికకు వెళ్లేదారి కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు దారుణంగా మారింది. వర్షాకాలం వచ్చిందంటే వర్షాలు పడితే రోడ్డు చెరువులను తలపిస్తుంది. రైతులు పొలాలకు వెళ్లాలంటే నరకం చూడాల్సిందే. అంతే కాకుండా ఎడ్ల బండ్లు కూడా వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. అలాగే ఎవరైనా చనిపోతే స్మశన వాటికకు వెళ్లడానికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బురద రోడ్లపై ప్రమాదకరంగా ఉన్న రోడ్లపై ప్రజలంతా ప్రయాణం కొనసాగిస్తున్నారు. సుమారు 500 వందల ఎకరాల వరకు పొలాలు ఉండడంతో గుంతల మయంగా మారిన రోడ్డుపై నుండి రైతులు ఎడ్ల బండ్లు బురదలో దిగబడుతున్న పొలాలకు వెళ్లడానికి ఇబ్బందులు పడుతూనే గమ్యస్థానాలను చేరుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డు బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పాలకులు, అధికారుల పట్టింపు కరువు

మండలంలో రవాణ సౌకర్యం మెరుగుపడేందుకు రహదారుల నిర్మాణం దిశగా కృషి చేయాల్సిన పాలకులు, అధికారుల నిర్లక్ష్య వైఖరి కారణంగా మండలంలోని రహదారులు అధ్వానంగా ఉన్నాయి. కొత్త రహదారుల నిర్మాణానికి చర్యలు తీసుకోకపోవడంతో మండలంలోని ప్రజలు ప్రమాదకరంగా ఉన్న రోడ్లపై తప్పనిసరి పరిస్థితుల్లో ప్రయాణాలు చేస్తున్నారు. మండలంలోని చింతపల్లి పరిధిలోని శ్మశాన వాటికకు వెళ్లే రోడ్డు వర్షాకాలంలో బురదమయంగా మారవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాధికారులు స్పందించి మండలంలోని రహదారులను నిర్మించి రవాణా సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.

విద్యార్థుల్లో ఆంగ్లభాష సామర్థ్యాలు పెంచాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

గిరిజన విద్యార్థులు ఆంగ్లభాష సామర్థ్యాల పెంపొందించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని గిరిజన సంక్షేమ ఉపసంచాలకులు రమాదేవి అన్నారు. జిల్లా కేంద్రంలోని బాలికల ఆదర్శ పాఠశాలలో తెలంగాణ ఎడ్యుకేషన్ లీడర్‌షిప్ సౌజన్యంతో ఆంగ్ల బోధన ఉపాధ్యాయులకు రెండు రోజుల శిక్షణ స్పోకెన్ ఇంగ్లీష్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గిరిజన సంక్షేమ పాఠశాలలను ఆంగ్ల మాధ్యమంలోకి మార్పు చేసిందన్నారు. విద్యార్థులను కూడా ఆ దిశగా సిద్ధం చేయాలన్నారు. అంతకు ముందు ఉపాధ్యాయులు ఆంగ్ల భాషపై పట్టు సాధించాలని సూచించారు. ప్రస్తుత సంవత్సరం పదో తరగతి విద్యార్థులు మొట్టమొదటిసారిగా ఆంగ్ల మాధ్యమంలో పరీక్ష రాయనున్నట్లు తెలిపారు. ప్రాథమిక స్థాయి నుండి ఇంగ్లీష్‌లో భాషా సామర్థ్యాలు పెంపొందించాలన్నారు. కార్యక్రమంలో ఏసీఎంఓ ఉద్ధవ్, శిక్షణ క్యాంప్ ఇన్‌చార్జీ కృష్ణారావు, డీఎస్ఓ మీనారెడ్డి, ఆసిఫాబాద్ ఏటీడీఓ చిరంజీవి, మంచిర్యాల ఏసీఎంఓ రాజమౌళి, మంచిర్యాల, ఆసిఫాబాద్ రిసోర్స్ పర్సన్ మడవి శంకర్, వామన్ రావు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు అభిజిత్, మీనాక్షి, పవన్, నిక్షిత, ఆంగ్ల భాష ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పు చెల్లదు

నవతెలంగాణ-సిర్పూర్(టి)



ఎస్సీవర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పు చెల్లదని అంబేద్కర్ సంఘం మండల అధ్యక్షుడురాజు అన్నారు. సోమవారం ఎస్సీ వర్గీకరణ సుప్రీంకోర్టు తీర్పును నిరసిస్తూ మండల అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో అంబేద్కర్ భవన్ నుండి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవలే సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును గౌరవిస్తున్నమని కానీ అది సరైనది కాదని భావిస్తున్నామన్నారు. పార్లమెంట్ కానీ, సుప్రీం కోర్టు కానీ రాజ్యాంగానికి లోబడి పని పనిచేయాలన్నారు. తీర్పుల వల్ల రాబోయే తరాల వారు రిజర్వేషన్ కోల్పోయే అవకాశం ఉందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆగ మేఘాల మీద తీర్మానం చేసి అవసరమైతే గవర్నర్ ఆర్డినెన్సు తీసుకొని వస్తాం అనడం విడ్డూరంగా ఉందన్నారు. భారత రాజ్యాంగానీ చట్ట ప్రకారం అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో దేవిదాస్, తిరుపతి, శివరాం, విక్రం, తులసిరామ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



పాఠశాలను తనిఖీ చేసిన అడిషనల్ కలెక్టర్

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ మండలం దంతన్‌గూడ పాఠశాలను సోమవారం అడిషనల్ కలెక్టర్ దీపక్ తివారి తనిఖీ చేశారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో పాఠశాలలో చేపడుతున్న పనులను పరిశీలించారు. టాయిలెట్ నిర్మాణం, పాఠశాల మరమ్మత్తులు, తాగునీటి సదుపాయం, విద్యుత్ సౌకర్యం పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలకు రంగులు వేసి తీర్చిదిద్దాలని సూచించారు. బాలికల మరుగుదొడ్ల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని, వాటి నిర్మాణం కూడా పూర్తి చేయాలని సూచించారు. ఆయన వెంట ప్లానింగ్ కో ఆర్డినేటర్ అబీద్‌అలీ, ప్రధానోపాధ్యాయులు హిమాయత్‌అలీ ఉన్నారు.

ఆస్పత్రి సిబ్బందికి పెండింగ్ వేతనాలు చెల్లించాలి

- ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు దివాకర్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని సామాజిక ఆస్పత్రిలో పనిచేస్తున్న సిబ్బందికి పెండింగ్‌లో ఉన్న మూడు నెలల వేతనాలు వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు దివాకర్ డిమాండ్ చేశారు. పెండింగ్ వేతనాలు ఇతర డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ ఆస్పత్రి ముందు ధర్నా నిర్వహించినంతరం సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్ వేతనాలు చెల్లించాలని, వేతనాలు చెల్లించని కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. మూడు నెలల నుంచి వేతనాలు రాకపోవడంతో కార్మికులు తమ కుటుంబాన్ని పోషించుకోలేక అనేక ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జీఓ 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి మల్లేష్, కార్మికులు మురళి, నీల, మమత పాల్గొన్నారు.

దరఖాస్తులు స్వీకరించిన అదనపు కలెక్టర్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం ప్రజావాణి ద్వారా వివిధ మండలాల నుండి వచ్చిన ఫిర్యాదుదారుల వద్ద నుండి అదనపు కలెక్టర్ (రెవెన్యూ) దాసరి వేణు, ఆర్డీఓ లోకేశ్వర్ రావుతో కలిసి ఫిర్యాదులు స్వీకరించారు. అధికారుల సమన్వయంతో ఫిర్యాదుల పరిష్కారంపై శ్రద్ధ చూపాలన్నారు. దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించేల చూడాలని ఆదేశించారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-సిర్పూర్(టి)

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలను గ్రామీణ ప్రజలకు చేరవేసేందుకు పోస్ట్ ఆఫీస్ ద్వారా అందుతున్న ప్రతి ఒక్క పథకం గురించి డాక్ చౌపాల్ అనే అవగాహన సదస్సును సోమవారం వేంపల్లి గ్రామపంచాయతీలో నిర్వహించారు. ఈ అవగాహన సదస్సులు సిర్పూర్, కాగజ్‌నగర్ సబ్ డివిజనల్ ఇన్స్‌పెక్టర్ సిరికొండ సతీష్ మాట్లాడుతూ పోస్ట్ ఆఫీస్ ద్వారా పలు రకాల చిన్న మొత్తాల పొదుపు పథకాలను తెలుసుకుంటు, బీమా చేసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ ఈ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం ఉత్తమ ప్రదర్శన కనబరిచిన ఉద్యోగులను సన్మానించారు. కార్యక్రమంలో ఐపీపీబీ బ్రాంచ్ మేనేజర్ మంచిర్యాల్ సాగర్, సిర్పూర్ తహసీల్దార్ శ్రీనివాస్, పంచాయతీ సెక్రటరీ ప్రవీణ్, స్థానిక బ్రాంచ్ పోస్ట్ మాస్టర్, తపాలా సిబ్బంది పాల్గొన్నారు.

రాజ్యాంగ బద్ధంగా అమలు చేయాలి

నవతెలంగాణ-కౌటాల

ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పును స్వాగతిస్తూనే పూర్తి రాజ్యాంగ బద్ధంగా అమలు చేయాలని దళిత బహుజన సంఘాలు కోరారు. సోమవారం తహసీల్దార్ ఇందారపు పుష్పలతకు దళిత బహుజన సంఘాలు వినతిపత్రం అందజేశాయి. ఈ సందర్భంగా బహుజన నాయకుడు దుర్గం ప్రవీణ్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ తీర్పు చెల్లదని, సుప్రీమ్ కోర్ట్ తీర్పులు ఏవైనా రాజ్యాంగానికి లోబడి ఉండాలన్నారు. కార్యక్రమంలో దళిత బహుజన నాయకులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడపకూడదు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

వాహన చోదకులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, మద్యం తాగి వాహనాలు నడపకూడదని ఎస్సై రాజేశ్వర్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్‌లో సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేసి వాహన చోదకులను బ్రీత్ ఎనలైజర్ ద్వారా పరీక్ష చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడపకూడదన్నారు. అలా చేస్తే డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. వాహనాలకు సంబంధించిన అన్ని అనుమతి పత్రాలు వెంట ఉంచుకోవాలన్నారు. పెండింగ్ చలాన్లు లేకుండా చూసుకోవాలన్నారు. దాదాపు 30 మందికి పైగా వాహన చోదకులకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ సాగర్, దిలీప్ పాల్గొన్నారు.

పేదలకు ఇంటి నెంబర్లు ఇవ్వాలి

తెలంగాణ-వాంకిడి

మండల కేంద్రంలోని లక్ష్మీ నగర్‌లో పేద ప్రజలు 13 సంవత్సరాల నుండి ఇంటి టాక్స్ లేకుండా నివాసముంటున్నారని ఇంటి నెంబర్లు వేసి పన్నులు తీసుకొని భద్రత కల్పించాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. సోమవారం తహసీల్దార్ రియాజ్ అలీకీ రియల్లీకి మండల కాంగ్రెస్ యూత్ ప్రెసిడెంట్ ప్రశాంత్ వినతిపత్రం అందజేశారు. తహసీల్దార్ స్పందించి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

మూర్ఛ వ్యాధితో వాగులో పడి మహిళ మృతి

నవతెలంగాణ-తిర్యాణి

మూర్ఛ వ్యాధితో వాగులో పడి మహిళ మృతి చెందిన సంఘటన మండలంలోని బుగ్గగూడ గ్రామంలో జరిగింది. సోమవారం ఎస్ఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని బుగ్గగూడ గ్రామానికి చెందిన టేకం రాజుభాయ్(34) భర్త భీముకు 15 సంవత్సరాల క్రితం వివాహం జరుగగా ఒక కుమారుడు ఉన్నాడు. వీరు కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. మృతురాలికి పుట్టినప్పటి నుండి మూర్ఛవాది ఉండగా అప్పుడప్పుడు వచ్చినప్పుడు వారి కుటుంబీకులు ఆమె బాగోగులు చూసుకుంటున్నారు. ఇదే క్రమంలో సోమవారం ఉదయం భర్త భీము పని నిమిత్తం బయటకు వెళ్లగా మృతురాలు బట్టలు పిండడానికి ఊరు పక్కన ఉన్న వాగుకు వెళ్లింది. అదే సమయంలో మూర్ఛ రావడంతో వాగులో పడి ఊపిరాడక చనిపోయిందని ఎస్ఐ రమేష్ తెలిపారు. కుమారుడు రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నూతన సీఐని కలిసిన మున్సిపల్ చైర్మన్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



పట్టణ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ నూతన సీఐగా బాధ్యతలు చేపట్టిన సునీల్ కుమార్‌ను మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్, బీఆర్ఎస్ కౌన్సిలర్లు మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం పోలీస్‌స్టేషన్‌లో సిఐని కలిసి శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పలు అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో పందిరి భూమన్న, సంజయ్, యోగేష్, శీను, కొండ గణేష్ పాల్గొన్నారు.

అక్రమ పరిహారంపై కలెక్టర్‌కు ఫిర్యాదు

నవతెలంగాణ - కాసిపేట

మండలంలోని పెద్దనపల్లి శివారులోని సర్వే నెంబర్ 5లో ప్రభుత్వ భూములకు అక్రమంగా పరిహారం పొందాలని కుట్ర చేస్తున్నారని, పరిహారం కాజేందుకు చేస్తున్న ప్రయత్నాలు నిలిపి వేయాలని కోరుతూ ప్రజావాణిలో కలెక్టర్ కుమార్ దీపక్‌కు బీజేపీ మండల అధ్యక్షుడు సూరం సంపత్ కుమార్, నాయకులు చింతల సాయివంశీ వినతిపత్రం అందించారు. మండలంలోని పెద్దనపల్లి శివారులోని సర్వే నెం.5లో ప్రభుత్వ భూమి కేకే 2 ఉపరితల గనిలో ముంపునకు గురవుతోందన్నారు. ఇదే అదునుగా కొందరు ప్రభుత్వ భూమిని సాగు చేస్తున్నామని పరిహారం పొందే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. ఇది వరకు సైతం ఇవే భూములకు నోటిఫికేషన్ జారీ చేసి పరిహారం పొందారని, గత ఏడాది కూడా పరిహారం కాజేసేందుకు ఎకరాల భూమికి నోటిఫికేషన్ జారీ చేయగా అసలు ఈ శివారులో 8 ఎకరాలకు మించి లేదని ఫిర్యాదులు అందగా పరిహారం నిలిపివేశారన్నారు. మరలా అధికారులు, కొందరు ప్రజాప్రతినిధులు కుమ్మక్కై పరిహారం పొందేందుకు కుట్ర చేస్తున్నారన్నారు. దీనిపై మండల ప్రజావాణిలో ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదన్నారు. దీనిపై కలెక్టర్ స్పందించి పూర్తి విచారణకు ఆర్డీవోకు ఆదేశాలు జారీ చేసినట్లు వారు వివరించారు.

దుకాణాల్లో పోలీసుల ఆకస్మిక తనిఖీలు

నవతెలంగాణ - కాసిపేట

పోలీస్‌స్టేషన్ పరిధిలోని దుకాణాల్లో ఏఎస్ఐ బూర రవీందర్ ఆధ్వర్యంలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. మత్తు పదార్థాలు, గంజాయి ఉత్పత్తులు, ప్రభుత్వ నిషేధిత వస్తువులు విద్యార్థులు చదువుకునే పాఠశాలలకు వంద మీటర్ల సమీపంలో అమ్మితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎక్కడైన అమ్ముతున్నట్టు సమాచారం తెలిస్తే 100 డయల్‌కు లేదా పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని, వెంటనే దుకాణ యాజమానిపై చర్యలు తీసుకుంటామని ఏఎస్ఐ తెలిపారు.


పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

నవతెలంగాణ-వేమనపల్లి

ఆరు నెలల క్రితం పోగొట్టుకున్న ఫోన్‌ను పోలీసులు పట్టుకొని మండలంలోని ముల్కలపేట గ్రామానికి చెందిన ఒడిల సుధాకర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ శ్యామ్‌పటేల్ మాట్లాడుతూ ఎవరైన ఫోన్ పోగొట్టుకుంటే పోలీస్‌స్టేషన్‌ను లేదా దగ్గరలోని మీ సేవా కేంద్రాల్లో వివరాలు అందజేయాలన్నారు. బాధితుని ఆల్టర్నేట్ మొబైల్ నెంబర్ నమోదు చేసినట్లయితే ఫోన్ వెతికి పట్టుకొని బాధితులు అప్పగిస్తామన్నారు. సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ (సీఈఐఆర్)అప్లికేషన్ ఉపయోగించి పోయిన సెల్‌ఫోన్లను వెతికి పట్టుకుంటామని తెలిపారు.

7న డిప్యూటీ సీఎం రాక

- సభా స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే బొజ్జు, ఆడే గజేందర్



నవతెలంగాణ-బజార్‌హత్నూర్

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు ఈ నెల 7న బుధవారం మండలంలోని పిప్పిరి గ్రామానికి రానున్నట్లు కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'స్వచ్ఛదనం-పచ్చదనం' కార్యక్రమంలో భాగంగా ఉప ముఖ్యమంత్రి రానున్నట్లు తెలిపారు. ఈ మేరకు సోమవారం సభాస్థలిని, హెలీప్యాడ్ నిర్మాణ స్థలాన్ని ఎమ్మెల్యే బొజ్జు, ఆడే గజేందర్ మండల నాయకులతో కలిసి పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ పిప్రి గ్రామం నుండి పీపుల్స్ మార్చ్ పాదయాత్ర ప్రారంభించి తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి ఈ ప్రాంతం నుంచే బీజం పడిందని తెలిపారు. అందుకే ఈ ప్రాంతానికి అధిక నిధులు కేటాయించి ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను నెరవేర్చుతారన్నారు. బహిరంగ సభ సందర్భంగా ఈ ప్రాంతానికి వరాల జల్లు ఉంటుందని, పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు కూడా చేస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ పార్లమెంట్ నాయకురాలు ఆత్రం సుగుణ, మాజీ జెడ్పిటిసిలు మల్లెపూల నర్సయ్య, గోక గణేష్‌రెడ్డి, తలమడుగు మాజీ ఎంపీపీ కళ్యాణం లక్ష్మీరాజేశ్వర్, కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి పాల్గొన్నారు.

విద్యాసామర్థ్యాల పెంపుదలకు కృషి చేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



విద్యాసామర్థ్యాల పెంపుదలకు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి టి.ప్రణీత అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల నెం.2లో ఆదిలాబాద్(అర్బన్), మావల మండలాల్లోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడారు. విద్యార్థులలో దాగి ఉన్న సామర్థ్యాలను ఉపాధ్యాయులు వెలికి తీయాలన్నారు. నేషనల్ అచీవ్మెంట్ సర్వే పరీక్షకు విద్యార్థులను సన్నద్ధం చేయాలని కోరారు. అవసరమైతే ప్రత్యేక తరగతుల ద్వారా విద్యార్థులను నిష్ణాతులుగా తీర్చిదిద్దాలన్నారు. ఎన్ఏఎస్ పరీక్షలో జిల్లా ముందు వరుసలో ఉండాలని సూచించారు. విద్యార్థుల శారీరక, మానసిక అభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు తుమ్మ లచ్చిరాం, సెక్టోరల్ అధికారి శ్రీకాంత్‌గౌడ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుధాకర్, రిసోర్స్ పర్సన్‌లు వెంకటేష్, రాజేశ్వర్, అశ్విని పాల్గొన్నారు.

డీఆర్డీఓగా బానోత్ దత్తారావు

ఆసిఫాబాద్ : జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారిగా బానోత్ దత్తారావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. శాఖ ఆధ్వర్యంలో జిల్లాల్లో చేపట్టే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పనులను అధికారుల సమన్వయంతో పూర్తి చేసే విధంగా కృషి చేస్తానని తెలిపారు. ఇప్పటి వరకు డీఆర్డీఓగా పనిచేసిన సురేందర్ బదిలీపై వెళ్లిన విషయం తెలిసిందే.

తపాల సేవలు సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ - కాసిపేట

తపాల శాఖ సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని బెల్లంపల్లి సబ్ డిజినల్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ ఆర్.విక్రం అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని తపాల శాఖ పొదుపు పథకాలు, ఇన్సూరెన్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. పోస్టల్ శాఖ ప్రజలకు అనేక సేవలు అందిస్తోందని, 10 ఏళ్లలోపు ఆడ పిల్లలకు సుకన్య సమృద్ధి ఖాతా, ప్రమాద బీమా 18 నుంచి 65 ఏళ్లలోపు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంవోలు తాజోద్దీన్, మధుకర్, బీపీఎం రడపాకా భూమన్న, అమూల్, సురేశ్, హమీద్, శంకరయ్య, నాయకులు రత్నం ప్రదీప్, మైదం రమేశ్, గోలేటి స్వామి, దారవేణి రాజయ్య, రాజ్ కుమార్, మంద వెంకటేశ్, జంపయ్య, రామ్మూర్తి పాల్గొన్నారు.

వయనాడ్ వరద బాధితులకు విరాళాల సేకరణ

బోథ్ : వివేకానంద పాఠశాల విద్యార్థులు వయనాడ్ వరద బాధితుల కోసం విరాళాలను సేకరించారు. సోమవారం మండలంలోని సొనాల గ్రామంలోని వివేకానంద పాఠశాల విద్యార్థులు గ్రామంలోని వ్యాపారుల వద్ద విరాళాలు సేకరించారు. కేరళ వయనాడ్ వరద బాధితులకు చిరు సాయంగా విరాళాలు చేసిన సాయాన్ని అందించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు కృష్ణ చైతన్య మాట్లాడుతూ కేరళ వయనాడ్‌లో వరద బీభత్సంతో ఎందరో మంది నిరాశ్రయులయ్యారనీ అన్నారు. వందల మంది తమ ప్రాణాలను కోల్పోయారని అన్నారు. విద్యార్థులకు దేశం ఆపత్కాల పరిస్థితులకు అనుగుణంగా స్పందించే గుణం మనవతా విలువలు సేవాభావమును పొందించుట కొరకు విద్యార్థులచే గ్రామంలోని వ్యాపారుల వద్ద ఉడతా భక్తి సహాయంగా విరాళాలను సేకరించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అవినాష్, శ్రీనివాస్, ఉపాధ్యాయ బృందం విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలి

భైంసా : బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించి, ప్రజలకు సేవలు అందించాలని ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ సూచించారు. సోమవారం భైంసా ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. అంటువ్యాధులు ప్రబలుతున్న తరుణంలో ఆరోగ్య విషయంలో అధికారులు జాగ్రత్త వహించాలన్నారు. సమావేశంలో భైంసా తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి, ఎంఈఓ సుభాష్, పశు వైద్యాధికారి విఠల్, ఆయా శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పచ్చదనం పరిశుభ్రతలో భాగస్వాములు కావాలి

- జిల్లా కలెక్టర్ రాజర్షిషా
- మున్సిపల్ కార్యాలయంలో స్వచ్ఛదనం
- డీఈఓ ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణాలు, పల్లెలు పరిశుభ్రంగా పచ్చదనంతో ఉండాలనే లక్ష్యంతో ప్రభుత్వాలు చేపడుతున్న కార్యక్రమాల్లో ప్రజలను భాగస్వాములు చేస్తేనే విజయవంతం అవుతాయని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. ఐదు రోజుల పాటు నిర్వహించే స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమాన్ని సోమవారం మున్సిపల్ కార్యాలయంలో అధికారులతో కలిసి ప్రారంభించారు. తొలి రోజు వైద్యారోగ్య, మున్సిపల్ సిబ్బందితో కలిసి సమావేశం నిర్వహించి, కార్యక్రమాల గురించి వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షిషా మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన స్వచ్ఛదనం పచ్చదనంలో సోమవారం నుంచి ఈ నెల 9వ తేదీ వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ ఐదు రోజులే కాకుండా ప్రతి నెల మూడో శనివారం స్వచ్ఛదనం పచ్చదనం నిర్వహించేలా ప్రణాళికలు చేసుకోవాలన్నారు. కుక్కల సమస్య ఎక్కువగా ఉందన్నారు. సీజనల్ వ్యాధులు కూడా ప్రబలుతున్నాయన్నారు. యానిమల్ బర్త్ కంట్రోల్‌కు ప్రత్యేక వెటర్నరి వైద్యున్ని నియమించేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్‌ను సూచించారు. అదే విధంగా వ్యాధులు ప్రబలుతున్న కాలనీల్లో వార్డు అధికారులు నిత్యం పర్యటిస్తూ నీరు నిల్వ లేకుండా చేస్తే రోగాలను అరికట్టవచ్చని తెలిపారు. ఆదిశగా ముందుకు సాగాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ మాట్లాడుతూ ప్రభుత్వాలు ప్రవేశ పెడుతున్న పథకాలు విజయవంతం కావాలంటే ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని అన్నారు. యానిమల్ కేర్ సెంటర్‌లో ఉచితంగా బర్త్ కంట్రోల్ ఆపరేషన్లు జరుగుతున్నాయన్నారు. కానీ దీనికి మున్సిపల్‌పై భారం పడుతుందన్నారు. అదే విధంగా పట్టణ ప్రగతి నిధులు రాకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నామన్నారు. పట్టణంలోని ఆయా కాలనీల్లో గ్రావెల్ వేయడానికి రూ.10లక్షలు మంజూరు చేయాలని కలెక్టర్‌ను కోరారు.

స్వచ్ఛదనం పచ్చదనంపై పట్టణంలో ర్యాలీ

మున్సిపల్ కార్యాలయం నుంచి డీఈఓ కార్యాలయం వరకు స్వచ్ఛదనం పచ్చదనపై అవగాహన ర్యాలీని నిర్వహించారు. దీనికి ఎమ్మెల్యే పాయల శంకర్ పాల్గొని ర్యాలీని ప్రారంభించారు. కలెక్టర్ రాజర్షిషాతో కలిసి డీఈఓ కార్యాలయానికి చేరుకున్నారు. అనంతరం మొక్కలు నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయల శంకర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో శిక్షణ కలెక్టర్ అభిగ్యాన్ మాలవీయ, డీఎంహెచ్ఓ డాక్టర్ నరేందర్, డీవైఎస్ఓ వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, కౌన్సిలర్లు పవన్ నాయక్, ఆకుల ప్రవీణ్, స్వప్న, ఆశాలు, ఏఎన్ఎం లు, వైద్య, మున్సిపల్ డీఈఓ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

టీచర్స్‌కాలనీలో...

స్వచ్ఛదనం పచ్చదనం వారోత్సవాల్లో భాగంగా సోమవారం జిల్లా కేంద్రంలోని టీచర్స్ కాలనీ శివాలయం ప్రాంగణంలో మున్సిపల్ సిబ్బంది ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. వర్షాకాలం నేపథ్యంలో మలేరియా, డెంగీ, చికెన్ గున్యా వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని, అందుకే ఇంటి పరిసరాలు, ఆలయ ప్రాంగణాలు పరిశుభ్రంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. దోమ తెరలను వాడాలని సూచించారు. పూల కుండీల్లో, కూలర్లలో, టైర్లలో, కుండల్లో నీరు నిల్వ ఉంటే వాటిని వెంటనే తొలగించాలని వివరించారు. అనంతరం స్వచ్ఛదనం పచ్చదనం కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు లెవెల్ అధికారి పన్నాలాల్, రిసోర్స్ పర్సన్ భవాని, ఆశ కార్యకర్తలు జ్యోతి, సురేఖ, ఆలయ కమిటీ సభ్యులు చంద్రకాంత్ టెంబెకర్, భూమయ్య, కార్లవార్ పాల్గొన్నారు.

నార్నూర్ : మొక్కలు నాటి పరిరక్షించి, పర్యావరణాన్ని కాపాడుదామని డీఆర్డీఓ సాయన్న అన్నారు. సోమవారం మండల కేంద్రంలో స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ కర్తవ్యంగా మొక్కలు నాటి వాటిని రక్షించేందుకు కృషి చేయాలని కోరారు. అదేవిధంగా వర్షాకాలం నేపథ్యంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీడీఓ జవహర్‌లాల్, ఏపీఓ జాదవ్ సురేష్, ఎంపీఓ స్వప్న శీల, డాక్టర్ రాంబాబు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సిరికొండ : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆర్డీఓ, మండల ప్రత్యేకాధికారి వినోద్ కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని సుంకిడి గ్రామంలో స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామంలో పరిశుభ్రతతో పాటు ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలని అన్నారు. మొక్కలను నాటడటంతో పచ్చదనంతో పాటు ఎటువంటి రోగాలు రాకుండా కాపాడతాయని అన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతతో ఎక్కడంటే అక్కడ చెత్త చెదరాన్ని వేయకుండా పరిశుభ్రత పాటించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జీ ఎంపీడీఓ రవీందర్, ఎంపీఓ సంతోష్, ఐకేపీ ఏపీఎం సంతోష్ పాల్గొన్నారు.

నార్నూర్ : మండలంలోని జామడ బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో సోమవారం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు చౌహాన్ వందన పాఠశాల సిబ్బంది ఆధ్వర్యంలో స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా చేసి, మొక్కలు నాటారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మించి, పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది ఆడే విశ్వనాథ్, జాదవ్ శివాజీ, రాథోడ్ హరిచంద్, ప్రేమ్ కుమార్, చంపావతి, గంగాధర్, మెస్రం మల్కు, రజినీకాంత్, రాథోడ్ రవీందర్, రాజ్యలక్ష్మి, ముక్తా కల్పన ఉన్నారు.

నేరడిగొండ : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం పచ్చదనం స్వచ్ఛదనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా డీఐఈఓ రవీంద్ర కుమార్ ఆధ్వర్యంలో కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. అంతేకాకుండా అధ్యాపక సిబ్బందితో కలిసి కళాశాల విషయాల పైన చర్చించడం జరిగిందని అన్నారు. అనంతరం అడ్మిషన్‌ల పెంపుపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ కార్యాలయంలో...

మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంచాలని ఎంపీడీఓ రాజ్‌వీర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ కార్యాలయంలో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ర్యాలీగా జెడ్పీహెచ్ఎస్ పాఠశాలకు వెళ్లి స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో భాగంగా పాఠశాల విద్యార్థులకు ఉపన్యాస పోటీలు, వ్యాసరచన పోటీలు నిర్వహించగా, గెలిచిన వారికి బహుమతులు అందజేశారు. అనంతరం పాఠశాల విద్యార్థులతో కలిసి మధ్యాహ్నం భోజనం చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం బోజనం పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి రవీందర్, ఎంపీఓ లక్ష్మణ్, ఏపీఎం ఉత్తమ్ కుమార్, ప్రధానోపాధ్యాయురాలు పద్మావతి, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఆదిలాబాద్‌టౌన్



నిర్మల్

లోకేశ్వరం : పచ్చదనంతో పాటు పరిశుభ్రతను పాటించాలని మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్‌రావు, ఎంపీడీఓ సోలమాన్‌రాజ్ అన్నారు.సోమవారం మండల కేంద్రంతో ఆయా గ్రామాల్లో స్వచ్ఛదనం, పచ్చదనంలో భాగంగా గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామ ప్రత్యేక అధికారులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులు స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమంలో భాగంగా గ్రామాలో ఐదు రోజులు నిర్వహించే కార్యక్రమాలను చదివి వినిపించారు. అనంతరం గ్రామస్తులతో పాటు విద్యార్థులతో ర్యాలీ చేపట్టి ప్రజలకు సీజనల్ వ్యాధులు, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమలో తహసీల్దార్ మోతీరాం, ప్రజాప్రతినిధులు, అధికారులు అంగన్‌వాడీ ఉపాధ్యాయురాలు, ఆశా కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి : ప్రతి ఒక్కరూ పరిసరాలను నిత్యం పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. సోమవారం మండలంలోని జడ్పీఎస్ఎస్ పాఠశాలలో స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో స్వచ్ఛత, పచ్చదనంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించేందుకు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిందని తెలిపారు. ఈ కార్యక్రమం 9 రోజుల పాటు కొనసాగుతుందని తెలిపారు. ఇంటితో పాటు ప్రభుత్వ, ప్రయివేటు కార్యాలయాల ఆవరణలో, చుట్టూ పరిసరాలను నిత్యం శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. మానవుడు ఆరోగ్యకరమైన జీవనాన్ని గడపాలంటే ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలను నాటాలన్నారు. చెట్లే జీవకోటికి జీవనాధారమని పేర్కొన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండాలంటే పరిసరాలను శుభ్రంగా ఉంచుతూ తొట్టెలలో, టైర్లలో, పాడుబడిన కూలర్, ట్యాంకులలో నీరు నిల్వ ఉంచకూడదని సూచించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులకు ప్రధానం చేశారు. తదనంతరం అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి మొక్కలను నాటి, ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిర్మల్ : స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమంలో పరిసరాల పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యతనివ్వాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. సోమవారం స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని బాగులవాడ చౌరస్తా నుండి డ్యాగవాడ వరకు కాలనీ ప్రజలు, అధికారులు, సిబ్బందితో కలిసి నిర్వహించిన ర్యాలీలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 'స్వచ్ఛదనం-పచ్చదనం' కార్యక్రమంలో పరిసరాల పరిశుభ్రతతో పాటు మొక్కలు నాటడం, నీటి సంరక్షణ తదితర అంశాలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఆగస్టు 5 నుండి 9 వరకు నిర్వహించే రోజువారి కార్యక్రమాలలో ప్రజలను భాగస్వామ్యం చేయాలని సూచించారు. ప్రతి మంగళ, శుక్రవారాలలో నిర్వహించే డ్రై డే కార్యక్రమంపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా మురికి కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, రోడ్లపై వర్షపు నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను సైతం శుభ్రంగా ఉంచుకోవాలని ఈ సందర్భంగా ప్రజలను కోరారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం అందరి భాగస్వామ్యంతో విజయవంతం చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, ఆర్డీఓ రత్నకళ్యాణి, మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, మున్సిపల్ కమిషనర్ రాజు, తహసీల్దార్ రాజు, మెప్మా పీడీ సుభాష్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బోథ్ : స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంతో పాటు సొనాల, ధన్నూర్(బి), సాకేర గ్రామాలలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సాకేరలో ఏర్పాటు చేసిన గ్రామసభలో పంచాయతీ కార్యదర్శి అశోక్ మాట్లాడారు. ఇంటి పరిసరాల చుట్టూ నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు. నీరు నిల్వ ఉన్నట్లయితే దోమలు అధికమై జ్వరాల బారిన పడతారని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కమలాకర్, అనసూయ, అన్నపూర్ణ, అంగన్వాడీ టీచర్లు సుశీల, ఈశ్వరి, గ్రామస్తులు పాల్గొన్నారు.

జైనథ్ : మండల కేంద్రంలో సోమవారం స్వచ్ఛధనం-పచ్చదనం నిర్వహించారు. అందులో భాగంగా విద్యార్థులతో కలిసి మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యురాలు నైనత, ఎంపీడీఓ రాఘవేంద్రనాథ్ పాల్గొన్నారు. ప్రాథమిక పాఠశాలను సందర్శించి శ్రమదానం చేశారు. డాక్టర్ నైనత పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తల గురించి తెలియజేశారు. జైనథ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కూడా శ్రమదానం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దుమాల దేవన్న, మాజీ ఎంపిటిసి కోడిచెర్ల సుదర్శన్, కార్యదర్శి ప్రశాంత్ పాల్గొన్నారు.

తాంసి : తాంసి, భీంపూర్ మండలాల్లో స్వచ్ఛదనం-పచ్చదనంలో వివిధ శాఖల అధికారులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు. మొదటగా గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో పరిసరాల పరిశుభ్రతపై ఎంపిడిఓలు, తహసీల్దార్లు గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అందరూ కలిసి పరిసరాలను పరిశుభ్రం చేశారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేక అధికారి వెంకటరమణ మాట్లాడుతూ 9 వరకు రోజు ఒక కార్యక్రమాన్ని తీసుకొని నిర్వహించాలన్నారు. రోడ్డుపై చెత్త వేయకుండా చెత్తబుట్టల్లో వేసి ఉంచాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మి, ఎంపీడీవో మోహన్‌రెడ్డి, డాక్టర్ శ్రావ్య, పంచాయతీ కార్యదర్శులు, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

నస్పూర్ : ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని చైర్మన్ సురిమిల్ల వేణు, మున్సిపల్ కమిషనర్ చిట్యాల సతీష్ అన్నారు. స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో భాగంగా సోమవారం సీసీసీ రాయల్ టాకీస్ నుండి ర్యాలీ చేపట్టారు. ప్లాస్టిక్, పచ్చదనం, మొక్కల పెంపకం, సానిటేషన్, డెంగ్యూ, మలేరియా వ్యాదులు, పర్యావరణం అంశాలపై పట్టణ ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డులలో పచ్చదనం కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతేకాకుండా మున్సిపాలిటీ పరిధిలోని పాఠశాలల్లో పచ్చదనం పరిశుభ్రతపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. 1,2,4,5,24 వార్డులలో మొక్కలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ గెల్లు రజిత, వార్డు కౌన్సిలర్స్ పాల్గొన్నారు.



లోకేశ్వరం



తాంసి



నస్పూర్



బోథ్